శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

వారితో కలసి ఈ ఇలలో జీవించిన వారు ధన్యులు. వారిని గురించి విని, వారిని దర్శించిన వారు ఇంకా ధన్యులు. వారిని సేవించిన వారు, ఆరాధించిన వారు మూడింతల ధన్యులు. ఈ మహాత్ములు మనకు కనుమరుగైనప్పటికీ ఆర్తులు, అర్థార్తులు, సాధకులు, భక్తులకు వారి ఉనికిని, అనుభూతిని ప్రసాదిస్తున్నారు...



ఇంతకుముందున్నది లీలా మానుష రూపం

ఆరాధనోత్సవ సంచిక

# గురుకృప

అవగాహనాపూరిత అర్చనే - ఆరాధన

# బాబాకు దగ్గరవడం

బాబాకి దగ్గర కావాలి అంటే, బాబాకి ఏం ఇష్టం? మనం ఎలా ఉండాలి అని బాబా అనుకుంటున్నారు, మనం అలా ఉండటం. ఆయనకి వీలైనంత వరకు, ఆయనకి కనిపించటం, ఆయన మనలను ఎక్కడో ఉంటే చూడలేరని కాదు. కాని ఆయన మన కంటి దృష్టిలో ఎప్పుడూ ఉంటారు కానీ మనకు తెలియాలి అది. అందుకని బాబా దర్శనం చేసుకోవటం, మనకు అవకాశం ఉంటే సత్సంగం, రోజూ బాబా ఫొటో దగ్గర కూర్చోవటం. మన దగ్గర ఎటువంటి అర్హతలు ఉన్నా, లేకపోయినా, ఏమీ లేకపోయినా కూడా మనల్ని ఇలా కాపాడుతూ మనకింత ఇస్తూ, ఇటువంటి లైఫ్‌ని ఇస్తూ, లైఫ్ అని అంటే ఊరకనే ఒక డబ్బులు, లేకపోతే ఒక కారు, ఒక బంగ్లానేకాదు. వీటన్నిటిని అనుభవించేటువంటి ఒక కాన్ఫిడెన్స్, ఒక సెన్సాఫ్ సెక్యూరిటీ. అది లేదనుకో ఎన్ని ఉంటే ఏం ఉపయోగం. నీకు పెరిగేకొద్దీ నీకు దాని అనుభవం తగ్గిపోతుంది. డబ్బులు ఇవి పెరిగేకొద్దీ ఆ సెన్సాఫ్ సెక్యూరిటీ లేదనుకో ప్రతిదానికి టెన్షనే, ప్రతిదానికి బాధే. అలా కాకుండా మాకేంటి బాబా ఉన్నారు అనుకునేవాడు ఎంజాయ్ చేస్తాడు.

బాబా ఉన్నాడు మనల్ని చూసుకోవడానికి, ఆ Sense of Security అది మనకిస్తూ మనల్ని ఇలా చూసుకునేటువంటి ఆయనతో మినిమమ్ ఒక ఐదు నిమిషాలన్నా ఆయన దగ్గర కూర్చుందాం అని రోజూ ఆ భావంతో ఊరకనే బాబా ఫొటోముందు పది నిమిషాలు పాటు కూర్చోండి ఆయన్ని చూస్తూ, చాలు. ఇంకేమీ పన్లేదు. మనకి అవకాశం వచ్చింది. మనల్ని ప్రేమిస్తూ, మనల్ని ప్రేమించేటువంటి ఆయన గురించి కాసేపు మాట్లాడుకుందాం. దాన్ని సత్సంగం అన్నాం, పేరు పెట్టాం దానికి. ఇంతే ఇంకేం చేయక్కరలా మనం. ఇలా చేస్తే బాబాకి నెమ్మదిగా మీరే దగ్గరవుతారు.




- శ్రీబాబూజీ

సంపుటి : 16
నవంబర్ 13

# గురుకృప

సంచిక : 5
2013



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

తనదై... తనువై... తానై... 4
- గురుకృప

అనుగ్రహం 8
- శరచ్చంద్రికలు

సద్గురుతత్వం 14
- శరచ్చంద్రికలు

చిరునవ్వులు - చిరుదివ్వెలు 21
- గురుకృప

కాశీలో కాయా! పండూ 24
- గురుకృప

అంతర్యామి ఆవాసం 26
- గురుకృప

నిర్వహణ : ***గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు***

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.

# తనదై... తనువై... తానై...




మానవాళి సహాయార్ధం భగవంతుడు మానవరూపం దాల్చి ఈ ఇలలో అవతరించడం కల్పనకాదు, ముమ్మాటికీ నిజం. ప్రతి అవతారమూర్తీ యుగావశ్యకతను ఈడేర్చి, మానవ జీవిత పరమావధిని సూచిస్తాడు (దైవంతో సహ జీవనం). కలల్లో, కథల్లో కనిపించే దైవం ఇలా భగవంతుని రూపంలో ఇలలో సంచరించడమేమిటి? అది కూడా మనందరిలో ఒకడై, శారీరకమైన అన్ని మార్పులకు సిద్ధపడటమేమిటి? అలా అయితే తాను భగవంతుడు ఎట్లా అయ్యాడు? కర్త తానే అయితే 'కర్మ'ను (జరిగేదానిని) శాసించలేడా? ఇలా ఎన్నో అనంతమైన ఆలోచనలు, అంతులేని సందేహాలు! సరే ఈ విషయాన్ని ఇలాగే వదిలేద్దాం. సంబంధం లేని మరో సంఘటనలోకి వెళ్దాం.

బిడ్డకు రాత్రి పడుకునే సమయంలో మంచి కథలు చెప్పి, విలువలను నింపుదామనం సత్యానికి ఉన్న ప్రాధాన్యతను చెప్పడానికి తండ్రి - గాంధీని, సత్యహరిశ్చంద్రను సోదాహరణగా చెప్పాడు. ఉదయం నిద్ర లేచాక తండ్రి పై అధికారి ఫోన్ చేసి "మీరెక్కడ ఉన్నారు?" అని అడిగాడు. పిల్లాడితోనే ఇంట్లో ఉన్న తండ్రి "సార్! కంపెనీ పనిమీదనే బయట ఉన్నాను" అని సమాధానం చెప్పాడు. ఇక ఆ బిడ్డ తన జీవితంలో అన్నిసార్లు నిజమే చెపుతాడా? లేక...? ప్రాకృతికమైన తల్లీ, తండ్రి... ఈ బంధాల్లోనే మనం ఇంతగా నేర్చుకుంటుంటే - మానవ జీవిత గమనాన్నీ, లక్ష్యాన్నీ దిశానిర్దేశం చేసే దైవం ఎలా ఉంటుంది? ఒక మంచి పుస్తకంగానో, ఒక మంచి సందేశంగానో, ఒక మంచి ప్రార్ధనగానో అవతరిస్తే మనిషి మనుగడ మారిపోతుందా?

మన జీవితాలను నిత్య నూతనంగా, ఉత్తేజభరితంగా, ఉత్పాదకంగా, మరొకరికి ఉత్ప్రేరకంగా మలిచేందుకు మహాత్ముడు మనిషిగా మనుగడకు తయారయ్యాడు. మాటలను ప్రోది చేసి మహత్తర కార్యాలను సాధించదలచలేదు. మనందరిలో ఒకడై మహాద్భుత కార్యాలను సాధించడమెలాగో నేర్పించాడు. మనలను నేర్పరిగా జీవించమన్నాడు. మాటల వేదాంతిని కాను నేను - చేతల చేనేతను అంటూ పట్టుబట్టను కట్టుబట్టగా అందించాడు. ఏతా వాతా తేలేదేమంటే ఆశయసాధనకై తానూ మనతో(డు) ఉండి శ్రమించాడు. సద్గురు పథంలో మాటలకు చోటులేదు. శుష్క వేదాంతానికి, డాంబికమైన వ్యర్ధ ఆచారాలకు, తంతులకు ఆస్కారం అసలే లేదు. ఇది 'తనదై'న మార్గం, తనదే అయిన మార్గం. అందుకే సాయి అన్నారు "మా సాంప్రదాయమే వేరు" అని.

**"తనదై"న మార్గంలో 'తనువంతా'**

నిజానికి మనందరం సద్గురువు దగ్గరకు పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కున్నట్లు వచ్చిన వారమే. అయితే వారిది 'చేతల' మార్గమయితే మనది 'మాటల' మార్గమవుతోందా? గమనించుకుందాం. సద్గురు

తత్త్వాన్ని ఆకళింపు చేసుకోకుండా – మ్రొక్కుబడిగా నమస్కారాలు, పరధ్యానంలో ప్రదక్షిణలు, నామజపాలు, పరాయణత్వానికి నోచుకోని పారాయణలు చేస్తూ, త్రికరణాలను (మనసు, మాట, పని) వేర్వేరు అడ్డదారుల్లో నడిపిస్తూ అలా నడిస్తేనే 'ఇహంలో మనుగడ' అంటూ లౌక్య భక్తులమవుతున్నామా? అన్న తులనాత్మక పరిశీలనా వైఖరిని అలవర్చుకుందాం.




ఒక సదాశయం కోసం వేసే ప్రతి అడుగును నిష్కర్షగా బేరీజు వేసుకుందాం. వారి గురువుగారు చెప్పిన మాటను తు.చ. తప్పకుండా పాటించడానికై ఆరు సంవత్సరాలు సత్సంగం కోసం వరదలొచ్చినా సరే, ప్రాణాలను సైతం లక్ష్యపెట్టకుండా ఏరుదాటి సత్సంగానికి వెళ్లడానికై గురువుగారికి ఉన్న శ్రద్ధాసక్తులు మనకు ఆదర్శం కావాలి. లౌక్య భక్తికి తిలోదకాలు వదిలి – గురుతత్త్వాన్ని, సద్గురుపథాన్ని దూరం చేసే ప్రతి అంశాన్ని వర్జించి, ఆచరణాత్మకమైన ఆయన జీవన విధానాన్ని, ఆదర్శాన్ని అనుసరిద్దాం.

పిల్లవాడు స్కూలు నుంచి రాగానే "బాబూ! ఈరోజు స్కూలులో ఏం చెప్పారు, ఏం నేర్చుకున్నావు" అని అడిగే మనం, సత్సంగం నుంచి వెళ్లగానే ఈరోజు నేను ఏమి నేర్చుకున్నానని ప్రశ్నించుకుందాం! విద్యను ఈ రోజున కేవలం 'భుక్తి' కోసంగానే అన్నట్లు తయారుచేసాం. దాన్నే సద్గురుపథంలోనూ చొప్పించి, ఎటువంటి అన్వేషణకు చోటివ్వడం లేదేమో ఆలోచిద్దాం. చదివిన విద్యను అప్లై చేయమని చెప్పే మనం – సద్గురుపథంలో నేర్చుకున్న అంశాలను ఆచరిద్దాం. ఆచరించడమంటూ మొదలెడితే 'సమస్య' కూడా మన ప్రగతికి సోపానమవుతుంది. సత్యాన్వేషణ, సానుకూల దృక్పథం, సాధించాలనే తపన, సవ్యమైన మార్గము, సద్గురువు పట్ల శరణాగతి ఇవన్నీ – "ఆచరించి, జీవించాలనుకునే" వ్యక్తికి అత్యావశ్యకాలు. ఆచరణకు నోచుకోని వ్యక్తి జీవితం ఎలా ఉంటుందంటే – వంట చేయడానికి అన్నీ ఉన్నాయి – బియ్యం, పప్పు, ఉప్పు, దినుసులు... అన్నీ ... అన్నీ... మొదలే వంటల పుస్తకం కూడా ఉంది. కానీ పొయ్యి వెలిగించే అనుభవం లేదు. ఇక సందేహమేముంది, మిగిలేది పస్తులే.

ఒక మహాత్ముడంటారు "భగవంతుడి వెనుక నువ్వు పరిగెత్తడం కాదు. భగవంతుడే నీ వెనుక పరుగెత్తేలా ఉండడానికి ప్రయత్నించు" అని. కొంచెం కొత్తగా అనిపించినా ఆలోచిస్తే వివేకానందునికై రామకృష్ణులు పడ్డ వేదన గుర్తొచ్చింది. తాను ఏదయితే నమ్మాడో, విశ్వసించాడో దానికోసం దేనినైనా అర్పించడానికి సిద్ధపడటం, ఫలితం పట్ల నిరపేక్షను కలిగి ఉండటం, గురుపథంలో పయనించే సమయంలో ఎదురయ్యే సుఖదుఃఖాలను సమంగా, సద్గురు ప్రసాదంగా స్వీకరించడం చేసేదే చెప్పడం, చెప్పింది చెయ్యడం... ఇదీ తనువంతా నింపుకోవడమంటే.

ఒకానొక రాజుగారు తన రాజ్యంలో చాటింపు వేయించారు. తన ఉత్తర, దక్షిణ ఉద్యానవనాల సంరక్షణకై ఇద్దరు తోటమాలులు కావాలని. పరీక్షానంతరం ఉత్తర ఉద్యానవనం విజయునికి, దక్షిణ ఉద్యానవనం జయునికి అప్పగించారు. జయుడు మిక్కిలి స్వామిభక్తి పరాయణుడు. రాజుగారి నిలువెత్తు

చిత్రపటాన్ని నిలబెట్టాడు. దక్షిణ ఉద్యాన వనంలో ప్రతిరోజూ ఒక కొత్త పూదండ! రాజుగారి కీర్తి నలుదిశలా తెలిసేలా నిత్య గాన విభావరి, ఇక ఒకటేమిటి ప్రతి నిత్యం రాజుగారి చిత్రానికి సకల సేవలు...




ఉత్తర ఉద్యానవనంలో విజయుడు రాజుగారి ఆలోచనల మేరకు ఒక శుభ్రమైన వాతావరణాన్ని అందించడానికి ప్రయత్నించాడు. ఎక్కడెక్కడో ఉన్న పుష్ప, ఫల జాతులను, ప్రజారోగ్యానికి సంబంధించిన అలభ్యంగా ఉన్న వృక్ష జాతులను ఫలదీకరించి, ఆ ఫలాలను రాజ్యంలోని ప్రజలకు అందించాడు. దేశ, విదేశాల్లో ప్రఖ్యాతి పొందింది ఉత్తర ఉద్యానవనం. శారీరక శ్రమను, విలువైన కాలాన్ని, తనకున్న జ్ఞానాన్ని ప్రోది చేసి విజయుడు ఉద్యానవనాన్ని, ఉత్తమంగా తీర్చిదిద్దాడు. కాలం గడిచింది. రాజు ఒకనాడు రెండు ఉద్యానవనాల్ని చూడ ముచ్చటించి వచ్చాడు. దక్షిణ వనాన – తన నిలువెత్తు చిత్తరువు, పూలు, పండ్లు, మ్రోడువారిన వృక్షాలు, చిగుర్లు నోచుకోని చింతమామిళ్లు! ఉత్తర వనాన.. ఆహ్లాదం, పక్షుల కిలకిలరావాల ఆనందం...పచ్చని వన తోరణాలు... పచ్చిక బయళ్లు... ఒకానొక ప్రవేశ ద్వారాంలో "అనుగ్రహరాజ్య ఉద్యానవనం" అన్న చిన్న స్వాగత ద్వారం... ఇంతే ఆచరించడంలోని ఆంతర్యం ఇది. ఆచరించడమంటే ఆయనవ్వడం... పూజలకు పరిమితం చేసే తత్త్వం కాదది... అపరిమితమైన పూజ్య భావాలకు అంకురార్పణ ఇది.. ఆచరణే నిజానికి ఆది (తొలి).

"యద్యదాచరతిశ్రేష్ఠ" ఆచరించి శ్రేష్ఠుడయిన ఆచార్యుని బిడ్డలం మనం.. ఆచరణకు చోటిద్దాం. ఆడంబరాలను త్యజిద్దాం. సద్గురుదేవునికే ఎందుకు ఇంతటి ప్రాధాన్యత.. అసలు ఆయన ఆసక్తి ఏమిటి ఈ ఆచరణా పూర్వక జీవన విధానంలో? ముందు చూద్దాం.

***తనువంతా నింపుకుంటే అయ్యేది తానే...***

మనిషి దైవంగా పెరగడం బాబా మతం... సద్గురు ప్రబోధంలో ఇదీ వారి అభిమతం. బిడ్డలను తనంతటి వారిగా తీర్చిదిద్దాలని, ద్వారం దగ్గర ఎదురు చూసే తల్లిదండ్రుల తపన ఇది. అందుకే ఈ రూపం. అందరికీ అనుగ్రహ, ఆశీర్వచనదాయకం. వారి జీవితమంతా తెరచిన పుస్తకంలా, భక్తి, జ్ఞానములకు ఒక నిఘంటువులా, ఆదర్శాల కోసం, విలువల కోసం పోరాడే ఒక యోధునిలా, సంస్కరణాపథంలో రాజీలేని సత్యవ్రతునిగా గమ్యమే కాదు సాగే గమనంలో కూడా స్వచ్ఛంగా ఉండాలన్న సమున్నత 'వ్యక్తి'గా, వ్యర్థ ఆచారాలను, తంతులను నిరసించడమేగాని 'నీరస (నిరాశ) వాదానికి' చోటివ్వని ఆశావాదిగా సాగిన వారి జీవితం మనకు నిత్య నూతన ప్రబోధం. గురుదేవుల జీవిత పర్యంతం ప్రతి అడుగులోనూ వారి ఆచరణే కనిపిస్తుంది. ఆశయాల కోసం – రాజీపడని ఆయన నైజం మనందరం గమనించుకోవాల్సిన క్షణాలివి. అవగాహనా పూరితంగా సద్గురువును అర్చించడమంటే – వారి ఆశయాలకు, ఆలోచనలకు, ఆదర్శాలకు అనుగుణంగా జీవించేందుకు ఉద్యుక్తులమవడమే. అదే నిజమైన ఆరాధన. ఆచరిస్తూ... అర్చిస్తూ... ఆరాధనోత్సవాలను జరుపుకుందాం..


***– గురుకృప***

## బాబా చర్యలు అగాధాలు




ఎప్పుడూ కూడా ఒకటి గుర్తుపెట్టుకోండి, బాబా ఎందుకు చేసారు అని ఆలోచించటం కరెక్ట్ కాదు. మీకు తెలియదు, ఎందుకంటే బాబానే చెప్పారు ఆ మాట. నా చర్యలు అగోచరాలు, అనూహ్యాలు అని అన్నారు, అగమ్యాలు అన్నారు. ఆయన ఒక ప్రక్కన నా చర్యలు అగమ్యాలు అని చెబుతుంటే, నీవు ఎందుకు చేసావు బాబా అని ఆలోచించటంలో అర్థం ఏమిటి? నాకు తెలిసిందల్లా ఒకే ఒక దానికి ఆలోచించవచ్చు. ప్రేమతో చేస్తారు. ఎందుకు చేస్తారాయన ఏదైనా సరే? మనమీద ప్రేమతో చేస్తారు అని గుర్తు పెట్టుకుంటే చాలు. ***ఎందుకు అనే దానికి ఒకటే ప్రశ్న... ప్రేమతో.*** ఇక మిగతా మన ఎక్స్‌ప్లొరేషన్ అంతా ఏమి చేసారు అంతే. నా చర్యలు అగమ్యాలు, నా లీలా సముద్రంలో ఎవరైతే మునుగుతారో వాళ్లకి రత్నాలు లభిస్తాయి అని అన్నారు. నేను అందుకనే ఏమన్నాను What he has done? అది మన ఎక్స్‌ప్లొరేషన్ అన్నా! అది బాబా చెప్పింది. దాంట్లో మునగండి, రత్నాలు లభిస్తాయి జ్ఞానరత్నాలు. ఎందుకు కాదు, ఏమిటి. ఆయన లీలంతా ఏమిటి? దేనికన్నా ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చాడా ఆయన?

మనవైపు నుంచి ఎక్స్‌ప్లోర్ చేయాలి. మనకు ఒకటే అర్థమయ్యేది ఒకటే అర్థమవుతుంది క్లియర్ కట్‌గా. ఆయన ప్రేమతో చేస్తారు. ఎందుకు మనమీద ప్రేమ? ఆయనకి మనం ఆయనకంటే భిన్నంగా మనం కనిపించము. మనల్ని మనం ఎట్లా ప్రేమించుకుంటామో ఆయన అనుభవంలో మనమందరం ఆయనలో భాగాలు కాబట్టి ఆయన ప్రేమిస్తారు. నిజానికి చెప్పాలంటే ఆయన దృష్టినుంచి మనల్ని ప్రేమించడమేమీ ఉండదు. ఎందుకంటే ఆయనకు మనము అంటూ వేరుగా లేము కనుక. ఆయన్ని ఆయన ప్రేమించుకుంటాడు అంతే. అందుకనే బాబా అన్నారు నువ్వు వేరు, నేను వేరు అనుకుంటావు. అది అబద్ధం. ఆ మధ్యలో ఉండే అడ్డుగోడని తొలగిస్తే నీకే తెలుస్తుందిరా నువ్వే నేను, నేనే నువ్వు ఇద్దరికీ డిఫరెన్స్ లేదు అన్నారు. ఆయన ఆ అనుభవంలో ఉన్నాడు. ఆయన మన మీద ప్రేమ చూపించటం ఏమీ లేదు. ఆయన మీద ఆయన ప్రేమ చూపించుకుంటున్నాడు మనలాగనే.




సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**

సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**



## అనుగ్రహం - అక్టోబర్ 2013



**భక్తుడు** : గురువుగారూ! మేము బాబా అనుగ్రహాన్ని పొందేటప్పుడు 'మేము నిస్సహాయులం' అనే భావన పూర్తిగా పోతుందా? అసలు మనకు మొదట మన నిస్సహాయస్థితి అనుభవమవుతుందా? బాబా అనుగ్రహమే ముందు అనుభవమవుతుందా?

**గురువుగారు :** ముందుగా మీ నిస్సహాయస్థితి అనుభవమవుతుంది, తరువాతే బాబా అనుగ్రహం. మీకు సహాయం అందినపుడు, అది బాబా ప్రసాదించినదని మీకు తెలుస్తుంది. ఈ ప్రక్రియంతా అనుగ్రహమే. అనుగ్రహం అంటే ఏదో పదార్థమో, పదార్థంతో నిండిన వస్తువో కాదు. (బాబా) అనుగ్రహం మీకు రక్షణను, ఆనందాన్ని ఇచ్చి సహాయం అందించే తీరు - ఆ మొత్తం క్రమం, విధానం - ఆ కూర్పునే అనుగ్రహమని అంటారు.

**భక్తుడు** : గురువుగారూ! బాబా అనుగ్రహం వలన మనం సహాయం పొందినపుడు, బాబానే మనకు సహాయపడ్డారని మనకెలా తెలుస్తుంది?

**గురువుగారు :** బాబా ఆ విషయం మీకు స్పష్టంగా తెలిసేటట్లు చేస్తారు. అది బాబా పద్ధతి. ఆయన మీకు ఏదైనా ఇవ్వడమే కాదు, అది తామే ఇచ్చామని మీకు తెలిసేటట్లు చేస్తారు కూడా! బాబా ఇచ్చే అనుభవాలు ఎంతో స్పష్టంగానూ నువ్వు మరోరకంగా అనుకోవడానికి వీలు లేకుండానూ ఉంటాయి. ఈ దృష్ట్యా బాబా ఇచ్చే అనుభవాలు అద్వితీయమైనవి. మీరు బాబాను ఏదైనా అడిగినపుడు, అది బాబానే ఇచ్చారు అనే విషయం మీకు ఎలాగోలా తెలుస్తుంది.

ఎవరికో ఒక ప్రమాదం జరుగుతుంది. కారు ఫల్టీలు కొట్టినప్పటికీ లోపల ఉన్నవారు ఎటువంటి దెబ్బలూ తగలకుండా బయటపడతారు. వెంటనే వారికి ప్రక్కన పోతున్న వేరే కారు కనిపిస్తుంది. దానిమీద అతనికి బాబా ఫొటో కనిపిస్తుంది "నేను నీ వెనుకనే ఉన్నాను, నిన్ను నేను రక్షించాను" అని అభయమిస్తున్నట్లుగా! ప్రమాదం జరిగిన తరువాత అతను చూసిన తొలి వాహనమది. ఆ కారు తనదారిన తాను వెళ్లిపోయింది. కానీ ఇతను బాబా ఫోటోను చూశాడు. బాబా ఆ విషయం నీకు తెలిసేటట్లు చేస్తారు. ఆ విషయంలో ఆయన చాలా ఖచ్చితంగా ఉంటారు! (నవ్వులు....)

**భక్తుడు** : గురువుగారూ! బాబా కురిపించే అనుగ్రహాన్ని గ్రహించే సామర్థ్యాన్ని మేము పెంపొందించుకోవడం ఎలా?

**గురువుగారు :** అది చాలా చిక్కు ప్రశ్న. మీరు అనుగ్రహాన్ని ఎలా పొందాలి అని అడిగితే మీలో అనుగ్రహాన్ని గ్రహించే సామర్థ్యాన్ని పెంచుకోమని చెప్పవచ్చు. అనుగ్రహాన్ని స్వీకరించే సామర్థ్యం ఎలా పెంచుకోవాలి అని అడిగితే – ముందు మీ అవసరం అంత గొప్పదిగా అయి ఉండాలి. అప్పుడు అనుగ్రహం మిమ్మల్ని వెల్లువలా ముంచెత్తుతుంది.




కాబట్టి అది అవసరం మీద ఆధారపడి ఉంటుంది! మన అవసరం ఏమిటి? మన లక్ష్యం ఏమిటి? మనకది నిజంగా అవసరమా? అది మనకు నిజంగా అవసరమయితే, ఆ అవసరమే మనకు అనుగ్రహాన్ని పొందే సామర్థ్యాన్ని ఇస్తుంది. మీకు ఆకలేస్తే ఆహారం తీసుకోవడానికి సిద్ధంగా ఉంటారు. మీకు దాహం వేస్తే నీళ్ళు త్రాగడానికి సంసిద్ధత వస్తుంది. మీకు దాహం లేకపోతే, నేను మీకు ఒక గ్లాసు మంచినీళ్ళు ఇచ్చినా మీరు వాటిని తిరస్కరిస్తారు. మీకు దానిని స్వీకరించడానికి కావలసిన సంసిద్ధత, గ్రహించేశక్తి ఉండదు.

అందుకని మన అవసరాన్ని అనుసరించి, అనుగ్రహాన్ని పొందడానికి కావలసిన సంసిద్ధత వస్తుంది. ఆ సంసిద్ధత వస్తే, బాబా చెప్పినట్లు – తీసుకెళ్లడానికి బండ్లకొద్దీ అనుగ్రహం ఉంది. అనుగ్రహం ఎప్పుడూ సంవృద్ధిగా ఉంది. అది మిమ్మల్ని ముంచెత్తడానికి సిద్ధంగా ఉంది. మీకు దానిని స్వీకరించగలిగేటటువంటి సంసిద్ధత ఉంటే మీరు దానిని పొందవచ్చు. మీరు దానిని పొందడానికి గల మీ సామర్థ్యం మీ అవసరాన్ని అనుసరించి ఉంటుంది.

మీ అవసరం, సంసిద్ధత, అనుగ్రహాన్ని ఎలా పొందాలి, ఎలా దానిని అనుభూతి చెందాలి అనే ఈ విషయాలన్నింటినీ కలిపి చూడడానికి మీకు కాస్త అవగాహన, విషయాలపట్ల పరిజ్ఞానం అవసరం. దానిని మీకు అందించడానికే నేను ప్రయత్నం చేస్తున్నాను.

**భక్తుడు** : సాక్షాత్కారం పొందడం కోసం మనం చెయ్యగలిగింది ఏమిటి?

**గురువుగారు :** ఇది తిరిగి అనుగ్రహాన్ని పొందడానికి మార్గమేమిటి? అనే మౌలికమైన ప్రశ్నకే దారితీస్తుంది. దానికి సమాధానమేమిటంటే ఆ అవసరం ఉండటమే! మనకు ఆత్మసాక్షాత్కారం కావాలని, ముక్తి కావాలని, మోక్షం కావాలని అనుకొంటాము. కానీ నిజంగా మనకది అవసరం లేదు. మనకు నిజంగా అవసరమైతే మనం దానిని పొందుతాము. **అవసరమే మనం అనుగ్రహం పొందడానికి గల ఏకైక అర్హత!** ఎందుకంటే అది అనుగ్రహం. అనుగ్రహం ఎప్పుడూ మన అవసరానికి అనుగుణంగా పనిచేస్తుంది. అలా కాకపోతే అది అనుగ్రహమే కాదు, మీకు అవసరం లేని దానిని మీమీద రుద్దడంలాగా ఉంటుంది. మీకు అవసరం లేని దానిని మీకు బలవంతంగా ఇస్తే మీరు దానిని అనుగ్రహం అని అనరు.

మీ అన్వేషణలో కనీసం ఈ స్థాయిలో ఇప్పటికైనా, "నేను పొందాలని ప్రయత్నిస్తున్నది నిజంగా




నాకు అవసరమా? అలా కానప్పుడు నేను దేనికోసం ప్రయత్నిస్తున్నాను? నేను దేనికోసం ప్రయత్నిస్తున్నానో దానిని పొందనీయకుండా అడ్డుపడుతున్నది ఏమిటి? నాకు ముక్తి కాకుండా మరేదైనా నిజమైన అవసరం ఉందా? ఉంటే ముందు దానిని పొందాలి అనుకొంటే అందులో ఏం తప్పులేదు. ఆత్మాసాక్షాత్కారము, ముక్తి, నిర్వాణం లేదా మరేదైనా సరే – వాటి పట్ల బుద్ధిపూర్వకంగా నేను రూపకల్పన చేసుకున్న సిద్ధాంతాలు, ఊహలు లేక భావనలు నాతో ఈ పనులన్నీ చేయిస్తున్నాయా?"... ఇలా తరచి చూసుకోండి. మీకు నిజంగా ఏదైనా అవసరమైతే అనుగ్రహం అందకపోవడమన్న సమస్యే లేదు.

**గురువుగారు :** "సద్గురువు అనుగ్రహం తప్ప వేరే మార్గం లేదు, అదొక్కటే దారి, మీరు చేయగలిగింది ఏమీ లేదు, అసలు ప్రయత్నమే అవసరం లేదు" అని నేను చెప్పను. మొట్టమొదట నేను చెప్పేదేమిటంటే, మీ ప్రయత్నం ద్వారా పరిపూర్ణత్వాన్ని, ఆ ఆనందాన్ని మీరు పొందగలిగితే ప్రయత్నం చేసి దానిని పొందండి. అది నాకు నచ్చుతుంది. మీ స్వయంకృషితో మీరు దానిని పొందనపుడు, పొందలేనపుడు, మీకు మీరుగా ప్రయత్నిస్తే దానిని పొందలేమని మీకు ఖచ్చితంగా తెలిసినపుడు, అనుగ్రహం కోసం వేరొకరిని అడగడం తప్ప మీకు గత్యంతరం లేదు. మీరు అనుగ్రహాన్ని ఆశిస్తున్నప్పుడు మాత్రం, "నేను భిక్షగాడిలా ఉండాలను కోవడం లేదు, నాకు నేను సాయం చేసుకోవాలనుకుంటున్నాను, ఎవరో దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాలనుకోవడం లేదు" అని అనుకోకండి. మీరు దానికి ముందే వేరొకరి దయాదాక్షిణ్యాల కోసం చూస్తున్నారు, ముందు దానిని ఒప్పుకోండి. లేదంటారా, మీకు మీరు సాయం చేసుకోగలిగితే, చేసుకోండి. అది నాకిష్టం కూడా! నేను మొదటగా మీకు మీరు సాయం చేసుకోవడానికే ప్రాముఖ్యతనిస్తాను.

**సద్గురు అనుగ్రహమా లేక మన ప్రయత్నమా? అనే మీమాంసకు పరిష్కారాన్ని చూపగలిగిన అంశం కేవలం ఒక్కటి మాత్రమే ఉంది. అదే ప్రేమ.** మీరు దేనినైనా ప్రేమించినపుడు మీకు స్వంత ఇష్టాయిష్టాలు, నచ్చడాలు నచ్చకపోవడాలు అంటూ ఉండవు. మీరు అటువంటి ప్రేమను అనుభూతి చెందనంతవరకు ఇదంతా ఒక సిద్ధాంతంలాగా ఉంటుంది. మీరు ఎవరినైనా గాఢంగా ప్రేమించినపుడు మీ స్వంత ఇష్టాయిష్టాలను వదలిపెట్టగలుగుతారు. ఇంతవరకూ మనం మాట్లాడుకుంటున్న **మానవ స్వభావంలోని సంక్లిష్టతలను అధిగమించడానికి గల ఏకైక పరిష్కారం ప్రేమ.** హృదయంలో ప్రేమ జాగృతమై, దానిని అనుభూతి చెందేవారికి – వారిలోని ప్రతిబంధకాలను, వారి ఇష్టాయిష్టాలను, తమ అసహాయతను ఒప్పుకోలేని దౌర్బల్యాలను అధిగమించడం చాలా తేలిక. వారికి తమ అశక్తత అసహాయతగా అనుభవం కాదు, వారు తమకు సహాయం అందుతున్నట్లు భావిస్తారు. వారి అశక్తత వారికి అదో దుర్గుణంలాగా అనిపించదు. ఒక పసిపాప విషయాన్ని ఉదాహరణగా ఇచ్చాను. ఆ పసిపిల్ల తనకు తాను సాయం చేసుకోలేదు. ఆ పసిపిల్లకన్నా అశక్తులు ఉంటారా? కానీ ఆ పాపకు ఆ విషయం అర్థంకాదు, తెలుసుకోలేదు. కానీ ఆ అశక్తత వల్ల తనేమీ ఇబ్బందిపడదు. తనను కంటికి రెప్పలా కాపాడే తల్లిదండ్రుల ప్రేమను,




సాయాన్ని ఆ పాప మరింతగా అనుభవిస్తుంది. ఆనందంగా త్రుళ్ళుతూ ఆస్వాదిస్తుంది. మనమూ అలా కాగలగాలి. అప్పుడు మనం అనుకొనే అశక్తత చింతించాల్సిన విషయం కాకుండా పోతుంది. చాలా అందమైన అంశంగా మారుతుంది. మనకు ప్రేమగా సహాయం చేసేవారు ఉన్నప్పుడు మన అశక్తత ప్రపంచంలో అన్నింటికన్నా అందంగా, ఆనందంగా ఉంటుంది. కాదంటారా? అలా కాదు మీకు మీరు సాయం చేసుకోవాలనుకుంటే, మీకు మీరు సాయం చేసుకోగలిగితే నేను ఇంతకుముందు పలుమార్లు చెప్పినట్టు – చాలా మంచిది, ముందు ఆ పని చెయ్యండి.

**భక్తుడు** : మన అసహాయత కూడా అందమైన అనుభూతి కావడమనేది సద్గురుని అనుగ్రహమే కదా? లేక కొంతమందికి సహజంగానే అటువంటి స్వభావం ఉంటుందా?

**గురువుగారు :** అది అనుగ్రహమే. కొంతమంది ఈ విషయాన్ని త్వరితగతిన తెలుసుకుంటారు. లేక అనుభవంలోనికి తెచ్చుకుంటారు. మిగతావాళ్లు, కరుడుగట్టిన తమ పూర్వపు ఆలోచనాధోరణులు, అలవాట్ల పట్టువలన దానికి అడ్డుపడతారు. ఈ ఆలోచనాధోరణుల గట్టిదనాన్ని కరిగించగలిగింది ప్రేమ. కానీ వాళ్లు అది అలా కరగడానికి అంగీకరించరు, అసలు ఆ ప్రేమను గుర్తించరు. వాళ్లు దానిని అడ్డుకుంటారు.

**భక్తుడు** : భగవాన్ రమణులతో, భక్తుల అనుభవాలను గురించిన ఒక పుస్తకాన్ని చదివాను. అందులో అనుగ్రహం ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉన్నదని, సద్గురువు దానిని సరైన దారికి మళ్లిస్తారనీ ఉంది.

**గురువుగారు :** ఈ రెండు విషయాలలో వైరుధ్యం ఎక్కడుంది? అనుగ్రహం ఎప్పుడూ ఉంది. సద్గురువు దానిని ప్రత్యేకమైన పద్ధతిలో సదరు వ్యక్తికి అందేట్టు చూస్తారు. కాబట్టి అది వ్యక్తిగతమైనది కూడా అవుతుంది. అది ఏదో ఒకరకమైన 'మానవాతీత అనుగ్రహం' కాదు అని భగవాన్ చెప్పదలచుకొన్నారు. అనుగ్రహం అంతటా ఉంది, దానిని పొందడం పొందకపోవడం నీ తలనొప్పి అని భగవాన్ ఉద్దేశ్యం కాదు. (నవ్వులు...) అది అలా ఉండదు. అనుగ్రహం అంతటా ఉంది, కానీ మీరు దానిని అనుభూతి చెందలేకపోతున్నారు. గురువు మీకు దానిని అనుభూతమయ్యేలా చూస్తారు. అంతేకానీ ఆయన ఆ కారణంగా అనుగ్రహాన్ని సృష్టించరు. అంతటా, అన్ని వేళలా ఉండేటటువంటి ఆ అనుగ్రహాన్ని మీరు ఆనందంగా అనుభవించడానికి గురువు దోహదపడతారు.

**భక్తుడు** : గురువుగారూ! వ్యక్తిగతమైన అనుగ్రహం అని మీరు అన్నారు కదా, దాని గురించి కొంచెం వివరంగా చెబుతారా?

**గురువుగారు :** దీని గురించి చాలారకాలుగా చెప్పవచ్చు. చూడండి ఇక్కడ మంచిగాలి వీస్తోంది. ఈ గాలి కోసమే నేను ఇంతదూరం వచ్చాను. అయినా నేను ఇరవై నాలుగు గంటలూ నా గదిలోనే ఉంటాను, చాలా కొద్దినిమిషాలు డాబా మీదకు వచ్చి ఈ గాలిని ఆస్వాదిస్తాను. మీరు కూర్చొని ఉన్న స్థలంలోకి బాగా గాలి వస్తుందనుకోండి, "గురువుగారూ! ఇక్కడకు గాలి బాగా వస్తోంది, దయచేసి ఇక్కడకు వచ్చి




కూర్చోండి" అంటారు. అప్పుడు మీరు గురువులాగా వ్యవహరిస్తూ నేను ఇక్కడ కూర్చొని నేను ఆ అనుభవం పొందడానికి తోడ్పడుతున్నారు, అంతే. నేను మీ సూచనను అనుసరించి ఇక్కడకు వచ్చి కూర్చొని ఇక్కడ వీస్తున్న చల్లని గాలిని ఆస్వాదిస్తున్నాను.

**భక్తుడు** : కాబట్టి అనుగ్రహ ప్రవాహం ఎప్పుడూ ఉంది.

**గురువుగారు :** అవును, అనుగ్రహ ప్రవాహం ఎప్పుడూ ఉంది.

**భక్తుడు** : అలా అయితే మేము అనుగ్రహాన్ని స్వీకరించడానికి అనువైన స్థితిలోనూ, స్థానంలోనూ లేము అనేది కూడా నిజమేనా?

**గురువుగారు :** అవును, అది కూడా నిజమే. అప్పుడు గురువు తాము వ్యక్తిగతంగా కురిపించే అనుగ్రహాన్ని సరైన దిశలో మీకు అందేలా చేసి, అంతటా నిండి వున్న అనుగ్రహాన్ని మీకు అనుభవమయ్యేలా చేస్తారు. అదీ పద్ధతి.

**భక్తుడు** : సద్గురువు పట్ల ప్రేమ అనుగ్రహం వలన కలుగుతుందా లేక మేమే ప్రేమ కలిగేలా చేసుకోవాలా?

**గురువుగారు :** సద్గురువు మీకు ప్రసాదిస్తున్న ప్రేమను అనుభవించనీయకుండా ఏదైనా అడ్డుపడుతున్నప్పుడు ఆ అడ్డాన్ని తొలగించుకోవడానికి మీ ప్రయత్నం అవసరం. అడ్డంకులను తొలగించుకోవడానికి మీరు చేసే ప్రయత్నం ఆ ప్రేమను మీరు మరింతగా అనుభవంలోనికి తెచ్చుకోవడానికి దోహదం చేస్తుంది. మీకు నిజంగా ఆకలి లేకపోతే, తినాలనే ఇచ్ఛ లేకపోతే, మీకు విందుభోజనం పెట్టినా మీరు దానిని ఆస్వాదించలేరు. అదీ అలాగే ఉంటుంది. ఇంకా, కొన్నిసార్లు మీకు నిజంగా తినాలని ఉండి, బాగా ఆకలిగా ఉన్నప్పుడు ఆహారం దొరకకపోయినా మీరు బాధపడతారు.

**భక్తుడు** : మరైతే ఆ అడ్డంకులను తొలగించుకోవడం ఎలా? అది మన ప్రయత్నం వలన పోతుందా లేక సద్గురువు అనుగ్రహం వలన పోతుందా?

**గురువుగారు :** రెండూ ఉంటాయి.

**భక్తుడు** : అనుగ్రహాన్ని పొందడంలో మాకేదైనా అడ్డంకులు ఉన్నప్పుడు, దానిని తొలగించుకోడానికి మేమెలా ప్రయత్నించాలి?

**గురువుగారు :** అది సదరు వ్యక్తి మీద ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే ప్రతి ఒక్కరూ అనుగ్రహాన్ని ఒక ప్రత్యేకమైన విధంగా అనుభవంలోనికి తెచ్చుకోవాలి అనుకొంటారు. దానిని ఆధారంగా చేసుకొని మీ అవసరం తీరే పద్ధతిలో మీరు ప్రయత్నించాలి. ప్రతి ఒక్కరికి ఎవరి మార్గం వారికి ఉంటుంది. అందరికీ వర్తించే సార్వజనీనమైన నియమాలు అంటూ ఉండవు. ఒక వ్యక్తికి "ఇలా చెయ్యాలి" అని నేను చెప్పాననుకోండి, అది మరొక వ్యక్తికి వర్తించకపోవచ్చు.

**భక్తుడు** : కానీ గురువుగారూ! నేను సద్గురు సన్నిధిని గాఢంగా అనుభూతి చెందుతున్న క్షణాలలో, ఆ సన్నిధే నేను ఆ అనుభవాన్ని నిలుపుకునేలా చేస్తూ నన్ను తనతో తీసుకెళుతున్నట్లు అనిపిస్తోంది.




**గురువుగారు :** నేను చెప్పేదేమిటంటే, ఆ సన్నిధి ఎప్పుడూ ఆ పని చేస్తూనే ఉంది, కానీ కొన్ని సందర్భాలలో నువ్వు అలా భావించడం జరుగుతుంది. మీకున్న అడ్డాలను తొలగించుకునే ప్రయత్నం చేస్తే, ఎల్లప్పుడూ మిమ్మల్ని ఆ సన్నిధే తీసుకెళుతుంది. ఎందుకంటే ఆ సన్నిధి ఎల్లప్పుడూ ఉంది, మీ భారాన్ని భరిస్తూ మిమ్మల్ని తీసుకెళు తూనే ఉంది. మీ భారాన్ని మీరు ఎక్కువగా అనుభూతి చెందడం వలన మిమ్మల్ని ఎత్తుకొని తీసుకెళుతున్నారనే విషయాన్ని అనుభూతి చెందడంలేదు. మీ అలవాట్ల భారం తగ్గినపుడు మీకు మీరు తేలికగా అనిపిస్తారు, అది మిమ్మల్ని ఎవరో ఎత్తుకొని తీసుకెళుతున్నట్లుగా తోస్తుంది.

**భక్తుడు** : గురువుగారూ! అనుగ్రహాన్ని గురించి మరికాస్త చెబుతారా?

**గురువుగారు :** మీలోని పరిపూర్ణత్వ భావనను వాస్తవం చేసుకొని స్పష్టంగా అనుభవంలోనికి తెచ్చుకోవడానికి మీరు ప్రయత్నిస్తున్నప్పుడు మీరు ప్రయత్నించి, ప్రయత్నించి, మీ ప్రయత్నాలన్నీ విఫలం అయినపుడు, మీ ప్రయత్నాలతో మీ అర్హతలతో సంబంధం లేకుండా మీకు ఏదైనా ఇవ్వబడినపుడు దానిని అనుగ్రహం అంటారు. అది దానంగా ఇచ్చినట్టు కాకుండా, ప్రేమతో ఇవ్వబడినదిగా ఉండాలి.

**భక్తుడు** : సద్గురువు ద్వారా ఇవ్వబడినది అయివుండాలా?

**గురువుగారు :** మీకు దానిని అలా ఎవరైతే ఇస్తారో, వారే సద్గురువు. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు** : మనం సద్గురుకృపను గ్రహించగలగాలి అన్నారు. అంటే బాబాను పిలవడం ద్వారా, మన ప్రార్థనల ద్వారా కృపకు పాత్రులమవుతామా?

**గురువుగారు :** అనుగ్రహాన్ని గ్రహించడం అంటే అది ఎక్కడో దాగిఉందని కాదు – అనుగ్రహం ఎప్పుడూ మీ తలుపు దగ్గరే ఉంది. సద్గురుకృపను గ్రహించడమంటే ఆ తలుపు తెరవడమే, అది చేస్తే చాలు. కరెంట్ ఫ్యాన్‌కు అనుసంధానమయ్యే ఉంది. మనం ఫ్యాన్ స్విచ్ వేయడం ద్వారా దానిని కరెంట్‌తో కలుపుతాము. కానీ కరెంట్ అక్కడ అప్పటికే ఉంది.

**భక్తుడు** : కాబట్టి మరోరకంగా చెప్పాలంటే ఈ విషయం మొత్తం – మనం అనుగ్రహం స్వీకరించడమనేది మనకు దానిపట్ల గల ఇచ్ఛ, మనకు గల సంసిద్ధత వద్దకు వస్తుంది. అదే కదా కీలకం?

**గురువుగారు :** అవును. దానిని స్వీకరించడానికి మీకు గల సంసిద్ధత. మీ సంసిద్ధత తిరిగి మీ అవసరం మీద ఆధారపడి ఉంటుంది. ఇప్పుడూ ఫ్యాన్ సిద్ధంగానే ఉండవచ్చు. ఇప్పుడు వాతావరణం చల్లగా ఉంది కాబట్టి మనకు ఫ్యాన్ అవసరం లేదు, అందుకని స్విచ్ వేయము. ఇది చిన్న విషయమే కదా! (గురువుగారు నవ్వుతూ...) కానీ స్విచ్ వేస్తే తిరగడానికి, మనకు చల్లదనాన్ని ఇవ్వడానికి ఫ్యాన్ సిద్ధంగా ఉంది, అనుగ్రహం అలాగే ఉంటుంది. కరెంట్ పోవడంలాగా అనుగ్రహం పోవడమంటూ ఉండదు. (నవ్వులు...) అనుగ్రహం అవధులు లేని సాగరంలా అక్కడ ఉంది.

# సద్గురుతత్త్వం - *నవంబర్ 2013*




**భక్తుడు** : గురువుగారూ! సద్గురువుతో మాకు అనుబంధం ఉన్నదని మాకు తెలియక పోయినప్పటికీ మా సద్గురువుతో మేమెప్పుడూ అనుబంధంలోనే ఉంటామా?

**గురువుగారు :** మీరు సద్గురువును కలుసుకోవడానికి ముందే ఆయనతో మీకు సంబంధం ఉంది. ఆయనను భౌతికంగా చూసినపుడే మీరు ఆయనను తొలిసారి కలుసుకున్నట్లు భావిస్తారు. కానీ ఆయనవైపు నుండి చూస్తే మీతో ఆయన కలవడం అనేది చాలా చాలా ముందే జరిగి ఉంటుంది. అది ఎంత ముందు అనేది మీ ఆలోచనలకు, కనీసం మీ ఊహకు కూడా అందదు. మీ జీవితంలోని ప్రతి సంఘటనా మిమ్మల్ని మీ సద్గురువు దగ్గరకు చేర్చడానికి దోహదం చేస్తుంది. ఈ రకంగా ఆయన మీ జీవితాన్ని ఎప్పటినుంచో మలుస్తూనే ఉన్నారు. భక్తులు బాబా వద్దకు వచ్చి తొలిసారి నమస్కరించినపుడు, ప్రక్కన ఎవరైనా ఉండి వారిని ఫలానా అని బాబాకు పరిచయం చేయబోతే, “అదే, నాకు ఇతను తొంభై జన్మల నుండి తెలుసు. ఇతనిని నాకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నాకు అతను తెలుసు, అతనిని నేనే ఇక్కడకు రప్పించాను” అనేవారు. మాధవరావు దేశ్‌పాండే (శ్యామా)తో కలసి నార్కే మొదటిసారి బాబాను దర్శించడానికి వెళ్లాడు. మాధవరావు, నార్కేను బాబాకు పరిచయం చేసాడు. బాబా వెంటనే “ఇతనిని నాకు పరిచయం చేస్తున్నావా! ముప్పై తరాల నుండి ఇతను నాకు తెలుసు!” అన్నారు.



**భక్తుడు** : సాయిబాబా ఈ ప్రస్తుత రూపాన్ని ధరించకముందు అంటే వారి ముందు జన్మల నుండి కూడా తమ భక్తుల బాగోగులు చూస్తున్నారా?

**గురువుగారు :** ఇంకొక రూపంలో! బాబా మరో రూపంలో వారిని సంరక్షిస్తూ ఉండవచ్చు.

**భక్తుడు** : కాబట్టి, బాబా తమ ఈ దేహాన్ని వదిలిపెట్టిన తరువాత కూడా మన బాగోగులు చూస్తూనే ఉన్నారా?

**గురువుగారు :** బాబా రకరకాల రూపాలలో తమ కార్యాన్ని నిర్వర్తిస్తూ ఉండవచ్చు. కానీ వారి ద్వారా వ్యక్తమయ్యే తత్త్వం మాత్రం ఒక్కటే. “(భగవత్ తత్త్వానికి గల) అన్ని రూపాలు నేనే. నాతో ఋణానుబంధం ఉన్నవారి బాగోగులు నేను చూస్తాను” అన్నారు బాబా.

ఉదాహరణకు, మన శరీరంలో ఒక కణానికి ఇబ్బంది కలిగిందనుకోండి. కాస్త దురదగా ఉందనుకొందాం. దానికి సహాయం కావాలి. మన శరీరంలోని మరో కణం దానికి సహాయం చేస్తుంది. ఎక్కడో మరో భాగానికి అవసరం కలిగితే ఇంకో భాగం సహాయం చేస్తుంది. బాబా ఒక్కరే కోట్లాది మంది కోసం పని



చేస్తున్నారని కాదు. సాయిబాబా ద్వారా వ్యక్తమవుతున్న ఆ తత్వం అందరి అవసరాలను తీరుస్తుంది.

**భక్తుడు** : మీరు బాబాకు పునర్జన్మ లేదని చెప్పారు. అవునా?

**గురువుగారు :** అవును.

**భక్తుడు** : మరి తమ భక్తులకు అవసరం ఉన్నంతవరకు తాము మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటామన్న బాబా సూక్తి సంగతి ఏమిటి?

**గురువుగారు :** అది పునర్జన్మ లాంటిది కాదు, అవతారం ధరించడం, పునర్జన్మకు, అవతరించడానికి చాలా తేడా ఉంది.

**భక్తుడు** : ఏమిటి ఆ తేడా?

**గురువుగారు :** సద్గురుతత్వమే బాబా రూపంలో అవతరించింది అని అనుకొన్నట్లయితే, కాలానుగుణంగా భక్తుల అవసరాలను బట్టి ఆ సద్గురుతత్వమే వేరు వేరు రూపాలను ధరిస్తుంది. పునర్జన్మ అంటే – సాయిబాబా మహాసమాధి చెందిన తరువాత, ఆయన ఆత్మ వేరే శరీరాన్ని ధరించి మళ్లీ రావడం. అంటే సాయిబాబా అని మనం పిలిచే ఆ పరిమితమైన రూపం మళ్లీ మరో జన్మనెత్తడం, అది పునర్జన్మ.

భక్తుల అవసరాలను తీర్చడానికి సద్గురుతత్వం ఒక రూపాన్ని ధరించడం అవతరించడమవుతుంది. భక్తుల అవసరాలను తీర్చే ఆ సద్గురుతత్వాన్ని 'అవతరణ' అని మీరు అనుకొన్నట్లయితే, కాలానుగుణంగా అది వివిధ రూపాలను ధరిస్తుంది. మనం దీనిని అంగీకరించినట్లయితే, సాయిబాబా ముందు వచ్చిన సద్గురువులందరినీ కూడా సద్గురుతత్వం యొక్క అవతారాలుగా అంగీకరించవలసి ఉంటుంది.

**భక్తుడు** : వీరు సద్గురుతత్వం యొక్క అవతారం అని ఉదాహరణగా చెప్పదగ్గవారెవరు?

**గురువుగారు :** కబీరు పంథీయులు (కబీరు చూపిన మార్గంలో ఉన్నవారు) కబీరును భగవంతుని అవతారంగా భావించేవారు.

**భక్తుడు** : బుద్ధుడు, క్రీస్తు సద్గురుతత్వపు ఇతర అవతారాలే కదా?

**గురువుగారు :** మీరు చెప్తున్నారు కదా. అవును, అది కూడా అంతే.

**భక్తుడు** : సద్గురుతత్వం అవతారం ధరించడానికి సాయిబాబాను ఒక ఉదాహరణగా మనం అంగీకరించినపుడు, ఆయనకు ముందు వేరే అవతారాలు ఉన్నట్లు మనం అంగీకరించాలి అన్నారు కదా. కానీ సద్గురుతత్వం నిజంగా అవతరిస్తున్నట్లయితే అటువంటి వారి సంఖ్య పరిమితంగానే ఉండాలి.

**గురువుగారు :** అవును, కానీ చాలామంది ఉన్నారు. చాలామంది ఉండి ఉండాలి అనే నేను చెప్పింది.

**భక్తుడు** : అందరూ కాదు కదా?

**గురువుగారు :** అది మనకు తెలియదు. కొంతమంది మాత్రం తప్పకుండా ఉండి ఉండాలి. ఫలానావారు




అవతారమా కాదా అని మనకు తెలియదు. ఎందుకంటే మతానికి, మతానికి మధ్య సిద్ధాంతంలో భేదం ఉంటుంది. ఏదేమైనప్పటికీ గతకాలంలో ఉద్భవించిన మహాత్ములు ఈ కాలానికి అనుగుణంగా భక్తుల అవసరాలను తీర్చలేకపోవచ్చు. రెండుమూడు వందల సంవత్సరాల తర్వాత సాయిబాబా అప్పటివారి అవసరాలకు అనుగుణంగా సాయపడకపోవచ్చని భక్తులు అనుకోవచ్చు. అప్పటికి మరో రూపం ఉద్భవించవచ్చు. ఎందుకంటే మన అవసరాలు మారుతాయి. కాలం మారుతుంది, మన అవసరాలు వ్యక్తం అయ్యే తీరు మారుతుంది కాబట్టి సద్గురుతత్వం మరో రూపాన్ని ధరించవచ్చు. ఉదాహరణకు ఎలిమెంటరీ స్కూలు టీచరు ఎలిమెంటరీ స్థాయిలో పిల్లల అవసరాలను తీర్చవచ్చు. పోస్టుగ్రాడ్యుయేషన్ స్థాయిలో తీసుకొంటే ఎలిమెంటరీ స్కూలు టీచర్ అసలు టీచర్‌లాగే కనిపించదు. కానీ నేను ఏమంటానంటే ఎలిమెంటరీ స్థాయి నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ స్థాయి వరకు గల ప్రతి టీచరు విద్యాబోధన అనే సూత్రానికే ప్రతిరూపాలు. విదార్థులకు ఆయాస్థాయిలలో వారు తోడ్పడుతారు. దీనినే నేను గురుతత్వం అంటాను.

**భక్తుడు** : గురువుగారూ! ప్రతి ఒక్కరికీ సద్గురువు ఉంటారా?

**గురువుగారు :** అవును, ప్రతి ఒక్కరికీ ఉంటారు. కానీ సద్గురువుకు ఆ విషయం ఎప్పుడు, ఎలా తెలియజేయాలో అలా తెలియజేయడానికి ఆయన పద్ధతులు, మార్గాలు ఆయనకుంటాయి. మనం ఆయన గురించి తెలుసుకుంటే మనమేదో ఆయనను ఎన్నుకున్నామని కాదు. మనకు ఆ విషయం తెలియకపోయి నప్పటికీ కూడా ఇదివరకే ఆయన ప్రభావం మన మీద ఉంది.

**భక్తుడు** : నిజాయితీగా అన్వేషించగలిగితే ఈ ప్రపంచంలో ఏదో ఒక రకమైన ఆధ్యాత్మికమైన మార్గదర్శకత్వం అంటూ లేని వారెవ్వరూ ఉండరు కదా? నా ఉద్దేశ్యం ఏమిటంటే ఏదో భగవంతుని రూపం అని కాకుండా ఆ వ్యక్తికి సంబంధించిన బాధ్యత వహించే ఏదో ఒక ఆధ్యాత్మిక అస్థిత్వం అంటూ ఉండాలి కదా?

**గురువుగారు :** నిజానికి వాళ్లు ఒక అస్తిత్వంగా ఉండరు, అదీ సాపేక్షమైన (పోల్చి చెప్పే) పదమే. ప్రతి ఒక్కరినీ పరిపూర్ణులుగా చేసేటటువంటి శక్తి మనలోనే నిక్షిప్తమై ఉంటుంది. ఆ తత్వమే సరైన సమయంలో ఏదో ఒక రూపంలో ప్రకటమవుతుంది. కానీ తత్వం మాత్రం అదే. నేను సద్గురువు గురించి మాట్లాడుతున్నప్పుడు నేను మాట్లాడేదీ ఆ తత్వాన్ని గురించే. మొత్తం ప్రపంచం అనుకూలం, ప్రతికూల శక్తులతో కూడి ఉంటుంది. ఉదాహరణకు భౌతికశాస్త్రాన్నే తీసుకోండి, ప్రతి పదార్థంలో న్యూట్రాన్, ఎలక్ట్రాన్, ప్రోటాన్ ఇలాంటివన్నీ ఉంటాయి. ఎలాక్ట్రాన్ ఎప్పుడూ కేంద్రకం వైపుకు లాగబడుతూ ఉంటుంది. దానిలో కలసిపోవాలని ప్రయత్నిస్తూ ఉంటుంది. సాధారణమైన మార్గాల మీద మనల్ని ఆధారపడనీయకుండా మనకు పూర్ణానందాన్ని అందించే ఆ తత్వాన్నే నేను సద్గురువు అంటాను. ఇది చాలా సహజంగా మనలోనే ఇమిడి ఉంటుంది, మనలోని జీవంతోపాటే మన జీవితంలో భాగంగానే

ఉంటుంది. అది మనలోనే ఉంది కాబట్టి సమయానుకూలంగా అదే ఒక సద్గురువు రూపంలో ప్రకటమవుతుంది.



సాధారణంగా మనం సద్గురువు వలననే మనకు ఆధ్యాత్మిక అనుభవం లభ్యమయ్యే అవకాశం ఉంటుందని, ఆయన ద్వారానే మనం పొందగలమని అనుకొంటాం. కానీ, మనకు అనుభవం రావడానికి కారణం మనం దానికి సమాయత్తంగా ఉండటమే. మనం ఆ అనుభవం పొందడానికి సిద్ధంగా ఉండటం వలనే మనం ఆ అనుభవాన్ని పొందుతున్నాము. నా చుట్టూ ఉండేవాళ్ళకు ఈ విషయం ఎందుకు తెలియదు? ఎందుకంటే అది ఈ సూత్రం వలననే: ఎవరైనా ఆధ్యాత్మిక అనుభవం పొందడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, ఆ పొందగలిగే అర్హత తగినంతగా ఉన్నప్పుడు, అది ఒక వ్యక్తి రూపంలో మీకు కనిపిస్తుంది. అప్పుడు మీరు ఆ వ్యక్తిని ఆశ్రయిస్తారు. తరువాత నెమ్మదిగా ఇతర ఆకర్షణల శక్తులన్నీ సద్గురువు అనే ఆకర్షణలో కలసిపోతాయి. "ప్రతి ఒక్కరికీ సద్గురువు ఉంటారు" అని నేను చెప్పినప్పుడు, ఆనందం పొందేందుకు మనకు మామూలుగా తెలిసిన మార్గాలమీద ఆధారపడకుండా, సంపూర్ణమైన ఆనందాన్ని పొందాలని ప్రతి వ్యక్తిలో ఉండే కోరిక గురించి, ప్రగాఢమైన ఇచ్ఛ అనే సూత్రం గురించి నేను మాట్లాడుతున్నాను. ప్రతి ఒక్కరికీ ఆ పరిపూర్ణమైన ఆనందం పొందాలని ఉంటుంది, కానీ పొందలేరు. అందువల్ల ఆనందం పొందేందుకు రకరకాల మార్గాలలో అన్వేషిస్తూ వివిధ రకాల పద్ధతులను ప్రోగేస్తూ, ఈ మార్గాలనే సంపూర్ణమైన ఆనందం అనే గమ్యంగా పొరబడుతుంటారు. సైద్ధాంతికంగా కొంతమందికి ఆ విషయం తెలియవచ్చు, తెలియకపోవచ్చు. కానీ మామూలుగా ఆనందాన్ని పొందే మార్గాలకు, సంపూర్ణ ఆనందం పొందాలనే అసహాయతకు అతీతంగా ఆనందం పొందాలి అనే సూత్రం మాత్రం అలాగే ఉంటుంది. ఈ కోరిక, ఈ సూత్రానికి నిర్దిష్టమైన రూపం లేదా ఈ కోరికను తీర్చే శక్తినే నేను సద్గురువు అంటాను.

**భక్తుడు :** మేము నిజంగా అన్వేషించేది ఒక స్వతంత్రమైన ఆనందం కోసం. అంటే బాహ్యమైన వస్తువుల మీద, విషయాల మీద ఆధారపడనటువంటి ఆనందం. కానీ ఆనందం కోసం మేము సద్గురువు మీద ఆధారపడటమనేది కూడా ఒక రకంగా మరొకరి మీద ఆధారపడటమే అవుతుంది కదా?

**గురువుగారు :** అవును. మొదట అది ఆధారపడటంలాగానే ఉంటుంది. అలా ఆధారపడటం మిమ్మల్ని ఎంతగా స్వతంత్రుల్ని చేస్తుందంటే ఇక మీరు దేని మీదా ఆధారపడనంతగా. మీరు నిజంగా సద్గురువు మీద సద్గురుతత్వం అనే సూత్రం మీద ఆధారపడగలిగితే – ఇప్పుడు మీరు అలానే ఉన్నట్లుగానే కనిపిస్తున్నా – కానీ మీరు నిజంగా ఆధారపడగలిగినపుడు, మీరు దేనిమీదా ఆధారపడిలేరు అనే విషయాన్ని గ్రహిస్తారు. అది పరస్పర వైరుధ్యతతో కూడిన అంశం.

**భక్తుడు :**అదెలా సంభవం గురువుగారూ?



**గురువుగారు :** మీరు ఆధారపడినపుడు తెలుస్తుంది! (నవ్వులు...)

**భక్తుడు** : ఆధారపడటమంటే అక్కడ ద్వంద్వత్వం ఉన్నట్లే. అంటే ఇద్దరు వేరువేరుగా (ఆధారపడేవారు, ఆధారమయ్యేవారు) ఉంటారు. అయినా, నిజంగా ఆధారపడటం జరిగిన తరువాత అటుపై ఆధారపడటం ఉండదని మీరంటున్నారు?

**గురువుగారు :** అవును. ఒక్కసారి నువ్వు ఆ అనుభవాన్ని పొందాక నిజంగా అది ఆధారపడటం కాదని మీరు అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ముందుగా అది ఒక రకమైనటువంటి పరాధీనతలాగే ఉంటుంది. అంతకుముందు ఆధారపడటం అనేది ఇబ్బందికరమైన అనుభవంగా ఉంటుంది. ఎందుకంటే అది మన దగ్గర లేనిదానికోసం, మనం అవసరం కోసం వేరొకరి మీద ఆధారపడుతున్నట్లు అనిపిస్తుంది. కానీ ఈ ఆధారపడటం క్రమంగా ఎలా మారుతుందంటే ఆధారపడటమే మీకు ఆ ఆనందానుభవాన్ని ఇస్తుంది, ఎందుకంటే అది అవసరార్థం ఆధారపడటం వంటిది కాదు. అది ఏమిటని చెప్పడానికి వేరే పదాలు లేవు. కాబట్టి దానిని నేను "ఆధారపడటం" అంటాను. ఈ కారణం చేతనే నేను దానికి "శరణాగతి", "ఆధారపడటం", "విధేయత" ఇటువంటి పదాలు నేను వాడను. సాధారణంగా మన అనుభవంలో ఇటువంటి పదాలకన్నింటికీ వేరే వ్యతిరేకమైన అర్థాలున్నాయి. కానీ నేను చెప్పే ఆధారపడటమనేది భిన్నమైనది, కానీ మనం దానిని ఆధారపడటం అనే అనాల్సివస్తోంది. ఎందుకంటే దానిని వివరించడానికి లేదా చక్కగా వ్యక్తం చేయడానికి వేరే పదాలు లేవు.

**భక్తుడు** : గురువుగారూ, మనం ఒక తత్వం మీద ఆధారపడుతున్నామా లేక ఒక వ్యక్తి (సద్గురువు) మీద ఆధారపడుతున్నామా? ఎందుకంటే మీరు ఇంతకుముందు ఒక తత్వం మానవరూపాన్ని ధరించడం గురించి పేర్కొన్నారు.

**గురువుగారు :** అవును, తత్వం ఒక రూపాన్ని ధరిస్తే ఆ రూపం ఆ తత్వాన్ని మరింత విస్పష్టంగా తెలియజేస్తుంది. అప్పుడు మనం ఆ రూపం మీద కూడా ఆధారపడినట్లు కనిపిస్తాము.

**భక్తుడు** : ఎందుకంటే నా విషయంలో నేను తత్వం మీద కంటే రూపం మీదనే ఆధారపడినట్లుగా భావిస్తున్నాను. అస్పష్టమైన ఒక తత్వం మీద ఆధారపడటం ఎలా?

**గురువుగారు :** అప్పుడు స్పష్టమైన రూపం అస్పష్టంగా అనిపించే తత్వం వైపుకు తీసుకెళుతుంది. మీరు ఎలా ఆలోచించినప్పటికీ రూపం ఆ తత్వానికి ప్రతిరూపంగా నిలుస్తుంది. కాబట్టి అది తత్వాన్ని స్పష్టంగా తెలుసుకొనేలా చేస్తుంది.

**భక్తుడు** : కానీ గురువుగారూ, నాకు రూపం లభ్యమయినపుడు నాకు ఆ తత్వాన్ని తెలుసుకోవలసిన అవసరం ఏముంది?

**గురువుగారు :** లేదు, నువ్వు తెలుసుకోవలసిన అవసరం లేదు! నువ్వు తెలుసుకోవాలని అనుకోవడం

కాదు – ఆ రూపం నువ్వు ఆ తత్వాన్ని తెలుసుకోవాలని అనుకొంటుంది.



**భక్తుడు** : కానీ గురువుగారూ, స్పష్టమైన రూపం నుండి అస్పష్టమైన తత్వానికి వెళ్లడం ఎందుకు?

**గురువుగారు :** ఎందుకంటే ఆయనంటూ ఎవరూ లేరు. ఆ తత్వమే ఆయన.

**భక్తుడు** : గురువుగారూ, దయచేసి సద్గురుతత్వం గురించి ఇంకొంచెం వివరించండి? దాని లక్షణాలు ఏమిటి?

**గురువుగారు :** ప్రేమ. ప్రతి ఒక్కరూ ప్రేమిస్తూ, ప్రేమను అనుభూతి చెందుతూ ఉండాలని ఆశించేటటువంటి ప్రేమ. అప్పుడు అది ఆధారపడటంలాగా ఉండదు, ద్వైతభావం ఉండదు, ఎటువంటి తారతమ్యాలు ఉండవు. సద్గురువు సమస్త సృష్టిని తమలో భాగంగా చూడటమే కాకుండా మిగతా అన్ని భాగాలు కూడా తాము అనుభూతి చెందుతున్న ప్రేమనే అనుభూతి చెందాలని ఆశిస్తారు.

**భక్తుడు** : అంటే మన పట్ల మనకుండేటువంటి ప్రేమ, పరిపూర్ణమైన ఆనందం కోసం మన అవసరం – సద్గురువుగా ప్రకటమవుతుంది. ఇది ప్రేమ వలన జరుగుతుంది కదా?

**గురువుగారు :** అవును, నేను ప్రేమ అని పిలిచేది ఆ తత్వాన్నే. దీనిని మీకు మరో రకంగా చెప్పాలంటే, మీరు ఇక్కడ ఎందుకున్నారని చూస్తే ప్రేమవల్లే ఇక్కడ ఉన్నారనిపిస్తుంది నాకు. అంతకుమించి మరేమీ లేదు. మిమ్మల్ని సంతోషపెట్టడానికి నా చుట్టూ ఇక్కడ వేరే ఆకర్షణలు ఏమీ లేవు. నిజానికి మిమ్మల్ని విచారానికి గురిచేసే విషయాలు ఎన్నో ఉన్నాయి. (నవ్వులు...) అది మీ అహానికి సంతృప్తిని ఇవ్వదు. ఎప్పుడూ బాధ కలిగిస్తూ ఉంటుంది, కలవరపెడుతూ ఉంటుంది. ఇక్కడ ఎటువంటి వాగ్దానాలు లేవు, భరోసాలు లేవు, హామీలు లేవు. అయినప్పటికీ "మేమిక్కడ, సంతోషంగా ఉన్నాము" అనే అనుభవం ఉంటుంది. కొన్ని సందర్భాలలో మీరు సంతోషంగా ఉండకపోవచ్చు. కానీ మీరు సంతోషంగా ఉండగలిగే మరో ప్రదేశం మీకు ఎక్కడా కనిపించదు. మీరు పూర్తిగా సంతోషంగా లేకపోవచ్చు. అయినప్పటికీ ఇక్కడ చాలా మెరుగ్గా ఉంటుంది, ఇక వేరే మార్గం లేదు. "నాకు ఇక మరే దారీ లేదు, నా ఆనందానికి ఇదే మార్గం, నాకు ఇంతకుమించి మార్గాలేవీ కనిపించడం లేదు" అనిపించే అనుభవం కనీసం మనకు ఒక్కసారైనా కలగాలి. అది మన ఆధ్యాత్మిక జీవితానికి ఆరంభం. వేదాలలో కూడా ఇదే చెప్పబడింది. "నాన్యః పంథా విద్యతే అవినాయ" – నాన్యః పంథా అంటే "వెళ్లడానికి వేరే మార్గం లేదు" ఎవరైనా అటువంటి స్థితికి చేరుకున్నప్పుడు, "వేరే మార్గం లేదు" అని నిర్ణయం తీసుకొన్నప్పుడు వారి ఆధ్యాత్మిక ప్రయాణం మొదలవుతుంది. అలా ఆ విషయాన్ని తెలుసుకోవడం, ఆ ఎరుక అతని ప్రేమకు వ్యక్తీకరణగా మారుతుంది. అతను ఆ మార్గానికి, ఆ లక్ష్యానికి – మీరు దానిని ఎలా పిలిచినా సరే – ప్రేమతో కట్టుబడి ఉంటాడు.

**భక్తుడు** : గురువుగారూ! ఆ వాక్యం రుగ్వేదంలోని పురుషసూక్తంలోనిది కదా?




**గురువుగారు :** "నాన్యః పంథా విద్యతే అవినాయ". అవును, అది పురుషసూక్తంలోనిదే.

**భక్తుడు** : వేదాల ద్వారా చెప్పబడిన పరమసత్యం తప్ప వేరే మార్గంలేదని వేదఋషులు నమ్మారు కదా?

**గురువుగారు :** అవును, వాళ్లు దానిని అలా భావించారు. క్రొత్తదైనా, పురాతనమైనదైనా మనిషి మనస్సు ఒక్కటే. ఆనందానుభవం ఒక్కటే. కోరికలు, దుఃఖం అన్నీ ఒక్కటే. మనం వాటిని ఎలా అనుభూతి చెందుతామో అదీ ఒక్కటే.

**భక్తుడు** : బాబా కూడా అనంతంగా విస్తరిస్తూ ఉంటారా?

**గురువుగారు :** అవును, ఖచ్చితంగా, ఆయన అనంతంగా విస్తరిస్తూ ఉంటారు. ఆయన నిశ్చలంగా / జడంగా ఉండే వ్యక్తి కాదు. నేను బాబాను ఏ మాత్రమూ అలా చూడను. ఆయన ఎంతో పరస్పర వైరుధ్యతతో కనిపిస్తారు. ఆయన పరిపూర్ణులు, అంటే అంతకు మించినది ఆయన పొందవలసినది మరేదీ ఉండదు – అని మీరన్నప్పటికీ – నేను దానికి అంగీకరించను. ఆయన అంతటి పరిపూర్ణత్వాన్ని పొందారు కాబట్టి ఆయన అనంతంగా వ్యాప్తి చెందుతున్నారు, విస్తృతమవుతున్నారు. దానికి అంతం లేదు. అలా విస్తృతమయ్యే తత్త్వాన్ని, ఆ విస్తృతి సూత్రాన్ని, నిరంతరం విస్తృతం కావడాన్నే మనం చూసేది. అది ఎంతో అద్భుతంగా ఉంటుంది. నేను బాబాను మొక్క నుండి వేరుపడిన పువ్వులా చూడను. ఆయన మొక్కకు పుష్పించిన పువ్వులాంటి వారు. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు** : కాబట్టి ఈ తత్త్వాన్నే బాబా సూచిస్తున్నారా?

**గురువుగారు :** అవును. ఆ తత్త్వానికి మూర్తీభవించిన రూపం ఆయన.

**భక్తుడు** : ఏదీ ఎప్పటికీ సంపూర్ణం కాదు.

**గురువుగారు :** అవును, ఏదీ ఎప్పటికీ సంపూర్ణం కాదు. కానీ ప్రతిసారీ అది పూర్ణంగా ఉన్నట్లు, అది పూర్ణత్వాన్ని పొందుతున్నట్లు, తనకు తానే పూర్ణత్వాన్ని అందుకొన్నట్లు అనిపిస్తుంది. పూర్ణత్వం తనను తాను పూర్ణం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఆ తత్త్వంలోని రమణీయత అదే.

**భక్తుడు** : ప్రతి జీవి ఆ పరిపూర్ణత్వం కోసం ప్రయత్నిస్తుంది కదా?

**గురువుగారు :** అవును, సౌందర్యంలోని రసాత్మకతను, పరిపూర్ణత్వం తనను తాను పరిపూర్ణం చేసుకోవడానికి ప్రయత్నించడంలోని రసతత్త్వాన్ని అర్థం చేసుకొంటే తప్ప మనకు చాలా శాస్త్రాలు కూడా అర్థం కావు. ప్రతి విషయానికి ఆద్యంతాలు ఇక్కడే ఉంటాయి. "బ్రహ్మం పరిపూర్ణమైనది, ప్రపంచం మొత్తం బ్రహ్మం నుండే వ్యక్తమయింది" అంటారు. కానీ బ్రహ్మం ప్రపంచాన్ని ఎందుకు వ్యక్తం చేయాలి? శాస్త్రాలు మాయ అని, అవిద్య అని చెప్తాయి. కానీ మాయ ఎలా వ్యక్తమయింది? "మొత్తం విశ్వాన్ని బ్రహ్మం తన నుండే

వ్యక్తం చేసాడు" అంటారు. ఆయన అసలు దానిని ఎందుకు వ్యక్తం చేయాలి? ఆయనకు వేరే పనిలేదా? (నవ్వులు...) నిజంగా బ్రహ్మం పరిపూర్ణమైతే, సంతృప్తమైతే, సంపూర్ణమైతే ఆయన తనను తాను ఇన్ని రూపాలలో ఎందుకు ప్రకటం చేసుకోవాలి? అంత అవసరం ఎక్కడ నుండి వచ్చింది? ఒకవేళ మీరది బ్రహ్మం కాదు అని అన్నారనుకోండి, అది మరేదో కావచ్చు. ఉదాహరణకు – మాయ అని అన్నారనుకోండి. బ్రహ్మంలో మొత్తం నిండిపోయినపుడు మాయ ఎక్కడ నుండి వచ్చింది? కాబట్టి బ్రహ్మం సంపూర్ణం కాదు. దానికి పరిమితులున్నాయి. మీరు రసతత్వాన్ని అర్థం చేసుకునేదాకా ఈ ప్రశ్నలు ఉంటూనే ఉంటాయి. బ్రహ్మంతో కేవలం అలా స్థిరమైన అస్థిత్వాన్ని కలిగి ఉండదు. మరింత ఎక్కువ సౌందర్యాన్ని దర్శించడానికి, తనను తాను మరింతగా ఆస్వాదించడానికి, మరింత సృష్టిని సృజిస్తుంది. ఎందుకంటే అది ఆయన స్వభావం, ఆయన ఆనందానుభూతి. తనను తాను సృష్టించుకొని తనను తాను పరిపూర్ణం చేసుకోవడం ఆయన స్వాత్మానందంలో భాగం. ఆయన అసంపూర్ణులని, పరిమితులు గలవారని, కొరత ఉన్నవారనీ కాదు. పరిపూర్ణత్వం తన పరిపూర్ణత్వాన్ని దర్శించడానికి, తమ పరిపూర్ణత్వాన్ని ఆస్వాదించడానికి ప్రయత్నిస్తోంది. ఈ రసతత్వం చాలా చాలా సూక్ష్మతరమైన అంశం. సద్గురువు కూడా ఇదే అంశాన్ని సూచిస్తారు.




## చిరునవ్వులు - చిరుదివ్వెలు

మానవుల బలహీనతల దగ్గర నుండి, నేటి మన సమాజపు పోకడల వరకు అన్నింటినీ తమ సరసాలలో ముంచెత్తుతారు మహనీయులు. ఆ సరసాలలో ఒకచోట ఉల్లాసాన్ని, మరోచోట ఓదార్పునిస్తారు. ఒకచోట ఒత్తిడులు తొలగిస్తారు. మరోచోట కథకు వేగాన్ని పెంచుతారు. ఒకచోట బలహీనతలను సరిచేస్తారు. మరోచోట కూడని పోకడలను సంస్కరిస్తారు. ఒకచోట ఆటపట్టిస్తారు. వేరొకచోట కథ రక్తికట్టిస్తారు. ఒకచోట మనల్ని ఉడికిస్తారు. వేరొకచోట మనలను ఊర్ధ్వలోకాలలో విహరింపచేస్తారు. ఇలా అప్పటి మన(సు) స్థితికి ఏది అవసరమో దానిని ఆ సరసంతో అనుగ్రహిస్తారు.

మహనీయుల మనస్సునకు సరసమాడటమనేది ఒక సహజ లక్షణంగా భాసిస్తూ ఉండటం అనాదిగా వస్తున్న అంశమే. మహనీయులు జీవిత సన్నివేశాలను, సంభాషణలను ఒక్కసారి ఈ దృష్టిలో పరిశీలించి చూస్తే సరసమన్నది వారిలో అంతర్లీనంగా తప్పక గోచరిస్తుంది. నవ్వడం, నవ్వించడం, నవ్వుతూ బ్రతకడమెలాగో నేర్పడం వారి జీవిత విధానంలోని ప్రధాన సూత్రంగా మనకు తప్పక గమనికకు వస్తుంది. నిరంతరం ఒత్తిడులకు లోనయ్యే మనలను, మనసులను ఆ ఒత్తిడులకు అతీతంగా నిలిపి నడిపించడం ఎలాగో గోచరిస్తుంది.

శ్రీబాబూజీ తన చుట్టూ చేరిన వారితో సరదాగా మాట్లాడుతూ, అప్పుడప్పుడు మనలోని పొరపాట్లు, అలవాట్లు ప్రవర్తనమీద హాస్యోక్తులు వేసేవారు. సత్సంగ గోష్ఠిలో శ్రీ బాబూజీ హాస్య చతురతతో నవ్వుల పువ్వులు పూసేవి. సత్సంగం ఆసాంతం అది రెండు గంటలైనా, నాలుగు గంటలైనా అందరూ నవ్వుతూనే

ఉండేవారు. వారి హాస్యానికన్నా ఆ మాటలోని మర్మం– అర్థం కావలిసిన వారికి అర్థమై సద్గురు ప్రబోధంగా, ప్రచోదనంగా పనిచేస్తుంది. ఆ సునిశిత హాస్యం మనలోని అహంకార పొరలను కరిగించేది. మనకు, వారికి మధ్యయున్న దూరాన్ని తగ్గించేది.




మనిషిగా నవ్వలేక పోవడమనే ఈ వ్యాధి నుండి మనిషిని బయటపడ వేసేందుకే మహాత్ముల నుండి హాస్యం వ్యక్తమవుతూ ఉంటుంది. తమ హాస్యంతోనే ఈ మానవ జీవితాలకు భాష్యం చెబుతూ ఉంటారు. గిలిగింతలు శరీరానికి పెట్టినా మనిషి నవ్వుతాడు. సగటు మనిషి ఎదుటివాని శరీరానికి పెట్టగలడు. మరికొంచెం ప్రయత్నిస్తే అతని దిగువ మనసుకు పెట్టగలడు. మహాత్ముడు అలాకాక మన మనస్సు లోని ఏ పొరకు అవసరమో, ఆ పొరకు గిలిగింతలు పెట్టగలడు. మనసుకు ఆవలనున్న బుద్ధికి కూడా గిలిగింతలు పెట్టగలడు. బుద్ధికి ఆవలనున్న 'మన'కు కూడా గిలిగింతలు పెట్టగలడు. అవి ఏ స్థాయిలో, ఏ మేరకు అవసరమో ఆ స్థాయిలో, ఆ మేరకు పెట్టి దివ్యమైన ఔచిత్యాన్నందిస్తారు.

గురువుగారి సన్నిధిలో జరిగిన సంఘటన, మరో మహాత్ముని సన్నిధిన జరిగిన సంఘటలను పరికిద్దామా ఇక...

***అడుగులోన... అడుగడుగున :***

సుమారు పండ్రెండు సంవత్సరాల నాటి మాట. ఆ రోజున జరిగిన సంఘటన నాకంటి ముందు జరిగింది. నాకింకా గుర్తు ఉంది. గురువుగారు శిరిడీ రేకుల షెడ్డులో చాలాకాలము అద్దెకు ఉన్నారు. ఆ రోజుల్లో వారిని కలవాలని, వారి ఆశీర్వచనం పొందాలని, లేదా తాము చేయబోవు వ్యాపారమో! వ్యవహారమో! వ్యక్తిగత అవసరాలనో వారి దృష్టికి తీసికొని వెళ్లాలని వచ్చేవారి సంఖ్య అధికంగా ఉండేది. అప్పటి ప్రజల అదృష్టమేమంటే గురువుగారు నెలలో ఇరవై రోజులకు తక్కువ కాకుండా రాత్రిపూట ఎక్కువగా బాబాను గూర్చి, బాబా లీలలను గూర్చి, బాబా చర్యలను గూర్చి చెప్పేవారు. కొందరికి చరిత్రపరంగానో, పారాయణ పరంగానో, సందేహాలుంటే నివృత్తి చేసుకునేవారు. గురువుగారిని అడిగి, ఒక్కొక్క సమయంలో ఇతిహాసాలు, వేదాలు, వేదాంత గ్రంథాలు, ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత, భాషా సాహిత్యము, ఎందరో విమర్శకులు, రచయితలను గూర్చి చెప్పేవారు. మూర్తీభవించిన విజ్ఞాన సారస్వ స్వరూపం గదా అది. తామేది చెప్పినా చివరికది బాబాకు ఎలా అన్వయించబడిందో వింటే అపురూపమనిపించేది ఆనాటి కాలం వారికి. హేమాడ్‌పంత్ గారనినట్లు, మళ్ళీ ఆ రోజులు రావేమో! ఆనందంగా పసిపిల్లవాడు తల్లి ఒడిలో చనుబాలు త్రాగుతూ పరవశిస్తూ ఆడుతూ, పాడుతూ హాయిగా నిద్రించే స్థితిలాంటివా రోజులు. మళ్ళీ అలాంటి రోజులు రావాలని ప్రార్థించుదాం.

గురువుగారంటే అభిమానం, గౌరవం, ప్రేమ, భక్తిశ్రద్ధలు, చనువు, ఇత్యాదిగల వారందరున్న ఒకానొకరోజున గురువుగారు చక్కని సత్సంగం – రేకుల ఇంట్లో చేస్తున్నారు. తొమ్మిది దాటిందనుకుంటాను. "సార్ తొమ్మిది దాటింది, నాకు నిద్రపోయే టైము, వస్తానని నమస్కరించి ఊదీ పెట్టించుకొని వెళ్లిపోయాడు.




మధ్యలో తన కారణంగా "సత్సంగం బ్రేక్" అవుతుందని అప్పట్లో సాయి వరప్రసాదరావు ఊహించలేకపోయాడు. ఇదే విధంగా రెండురోజులు పై మాదిరిగానే తొమ్మిది దాటగానే సాయి వరప్రసాదరావు గురువుగారి సత్సంగానికి అంతరాయం కల్గించి, గురువుగారు చెప్పే మహనీయమైన విషయాలు వినకుండా వెళ్లిపడుకునేవాడు. (యన్. సాయివరప్రసాదరావుగారు క్షమించాలి. క్షమిస్తారనే వ్రాస్తున్నాను).

ఆ మరుసటిరోజు మరల గురుదేవులు సత్సంగం చేస్తున్నారు. మధ్యలో సందర్భానికి సమయానికి చెప్పే అంశానికి సహజాతి సహజంగా అతికేలా! ఇలా అన్నారు "సాధారణంగా కొందరు రెండవ ఆట సినిమాలకు వెళ్లి రెండు గంటలదాకా మేల్కొనగల్గుతున్నారు. నాటకాల మీది అభిమానంతో రాత్రంతా మేల్కొనగల్గుతున్నారు. టివిలో రక్తసంబంధం వంటివో, ఎన్‌టిఆర్ సినిమాలైతే పండెండు గంటలదాకా చూడగల్గుతున్నారు. ఇలా ఉండగల్గిన వారు శిరిడీలో మాత్రం బాబాను గూర్చి మంచి విషయాలు వినే సమయంలో టైం ప్రకారంగా తొమ్మిది గంటలకే నిద్రపోయే వారిలా! ఆరోగ్యాన్ని కాపాడుకునే వారిలా మాట్లాడి వెళ్లిపోతారు. అసలు మనమిక్కడకు ఎందుకు వచ్చామో! ఏం సాధించాలని వచ్చామో! ఏం చేయాలని వచ్చామో! మర్చిపోయి వివరణ లేకుండా, విపరీతంగా, వింతగా ప్రవర్తిస్తాము. నిద్రే ముఖ్యమనుకుంటే శిరిడీ దాకా రావాలా! ఆ పని వాళ్ల ఊర్లోకూడా చేయవచ్చునే! పైకి మాత్రం మేం శిరిడీ వెళ్లాం, పదిరోజులున్నామని గొప్పలు చెప్పుకోవడానికే తప్ప పదిరోజులుండి బాబా సన్నిధిలో మనం సాధించినదేమిటి? పొందిన అనుభవాలేమిటో? ఆలోచించండి. నిజం చెప్పాలంటే శిరిడీలో కుక్కలు కూడా రాత్రిపూట రెండుగంటలదాకా మేల్కొనే ఉంటాయి. కావాలంటే చూడండి అన్నారు. వ్రాసే విధానం, తెలియక, వ్రాయనలవి కాని వాక్యాలలో కఠినం ఉందికాని, గురువుగారు చెప్పిన ధోరణిలో ప్రేమ, లాలన, ఆప్యాయత, అనురాగం, ఆ వ్యక్తి అభివృద్ధి పట్ల కాంక్ష ఇత్యాదులే అధికంగా ఉన్నాయి. చక్కని ఆవు జున్ను, పండిన చక్రకేళి, అమృతఫలం, నిన్న చేసిన చిత్రాన్నం కంటే గూడా ఎంతో రుచిగా, చక్కగా, ఎలా చెబితే ఆ జీవికి కష్టం కలగకుండా అర్థమవుతుందో అలా వివరించారు. సాయి వరప్రసాదరావు ఆరోజు లేస్తారని చూచాను. ఆరోజు నుండి వారు తొమ్మిదింటికి శిరిడీలో నిద్రించిన దాఖలాలు లేవు. ఈమధ్య పదిరోజులక్రితం అడిగినాము. రెండోఆట సినిమాలకు, డ్రామాలకు వెళ్తున్నారా అంటే? గురువుగారి పుణ్యమా అని ఈ రోజు వరకు వెళ్లలేదనినాడు. ఇలా వ్యక్తి వ్యక్తిని సంస్కరించి సాయినాథుని పదసన్నిధికి చేర్చేదాకా గురూజీ అవిశ్రాంతగా ఇలా పాటు పడుతుంటారనడంలో సందేహం లేదు. అందుకే సద్గురుని శరణుజొచ్చిన వారికి చింతలకు తావుండదు. మన గమ్యమేమిటో తెలియకపోయినా! ఆయనే వారిని చేయిపట్టి నడిపిస్తారు. **అడుగులోన అడుగువేయించి, అడుగడుగునకు సముదాయించి అండగా దండియై దయామయుడై, నడిపించు గమ్యానికి జన్యసముడై!**

**– భక్తిభరిణె నుండి గురుకృప 2003 విజయదశమి సంచిక**

# కాశీలో కాయా! పండూ




ఒకనాడు రచనా వ్యాసంగం జరుగుతోంది. మాస్టరుగారి గొంతూ, రమణమూర్తి గారి టైపు మిషను అప్పటికి చాలా సేపటినుండి ఏకధాటిగా పనిచేస్తున్నాయి. మాస్టరుగారు చెబుతూ ఉంటే అదే స్పీడులో రమణమూర్తిగారు టైపు చేస్తున్నారు. వ్యాసుని దగ్గర గణపతి వంటివారాయన.

ఉన్నట్టుండి చెప్పడాన్ని ఆపి మాస్టరుగారు ప్రక్కగదిలోకి వెళ్లారు. వస్తూ మామిడి పళ్లు తెచ్చారు. అక్కడున్న అందరికీ పంచారు. తినండీ అన్నట్లు అందరివైపు చూసారు. అవి రసాలు, పెద్ద రసాలు. మాస్టరుగారు రసాన్ని సేవిస్తున్నారు. మాస్టరుగారు మామిడిపండును తీసుకొంటున్నప్పుడు ఆ దృశ్యం చూడముచ్చటగా ఉంటుంది. పండు నలగదు, చేతికంటదు. అది ఒక ఒడుపు. ప్రస్తుతం ఆయనకు ఆటవిడుపు.

మధ్యలో రమణమూర్తిగారివైపు చూసారు మాస్టరుగారు. ఆయన ఎప్పటిలాగానే టైపు మిషనుపై వేళ్లు పెట్టుకొని చూస్తున్నారు.

"ఏమి స్వామీ అలా ఉండిపోయారు. మామిడిపండు తినకుండా, అది మామూలు పండుకాదయ్యా! మామిడిపండు. విభూతియోగంలో పండ్ల సంగతి చెప్పలేదుగాని ఒకవేళ చెప్పి ఉంటే పండ్లలో నేను మామిడిపండును అని చెప్పి ఉండేవాడు కృష్ణుడు. అదిసరే ఏమిటి మీరు ఏదో సంశయిస్తున్నట్లుగా..." అన్నారు మాస్టరుగారు.

రమణమూర్తిగారు చేతులు జోడిస్తూ "నేను మామిడి పండును కాశీలో వదిలిపెట్టాను మాస్టరుగారూ" అన్నారు.

"మీరు వదిలిపెట్టింది కాశీలోకదా! ఇది విశాఖపట్నం. ఇక్కడ తినొచ్చు" అన్నారు మాస్టరుగారు ఆయన్ను ఆటపట్టిస్తూ.

రమణమూర్తిగారికి నవ్వొచ్చింది. అంతలోనే కొంచెం భయం కూడా వేసింది. అటు కాశీవిశ్వేశ్వరుడు ఇటు సాక్షాత్తూ గురుదేవుడు. ఆ విశ్వేశ్వరుడే ఇలా గురుదేవుడై ఆటపట్టించడం లేదుకదా కొంపదీసి అని. "తప్పకుండా తీసుకుంటాను మాస్టారు ఇది మీరిచ్చిన ప్రసాదం కదా! ప్రసాదమైనప్పుడు ఇక అది ఏ పండన్న ప్రశ్నే లేదు" అంటూ పండును చేతుల్లోకి తీసుకున్నారు.

"ఆ!ఆ! ఈ మధ్య రమణమూర్తిగారు కూడా చక్కగా సమన్వయిస్తున్నారే, ఇంతకూ మీరు ఏం ఏం విడిచి పెట్టారండీ అక్కడ" అన్నారు మాస్టరుగారు.

పండుతో సహా చేతులు జోడిస్తూ రమణమూర్తిగారు "కాశీ వెళ్లినవారు ఒక కాయ, ఒక పండు విడిచిపెట్టాలంటారు కదండీ, నేను కాయల్లో వంకాయను పండ్లలో మామిడి పండును విడిచిపెట్టాను" అన్నారు.




"అయితే మీచేత తినిపించవలసింది ఇంకా ఒక వంకాయ ఉందన్నమాట. దానికి ఎప్పుడో ముహూర్తం వస్తుంది. మీ వ్రతాన్ని భంగం చేయాలన్నదేగా మా వ్రతం ఏమంటారు? దశాబ్దాల తరబడి నియమనిష్టల్ని పాటించడంలో నిప్పులాంటి వారని పేరు తెచ్చుకొని ఇప్పుడిలాంటి గురువుకు దొరికిపోయారేం స్వామీ" అన్నారు మాస్టరుగారు చిలిపిగా చూస్తూ.

"అదే అదృష్టం. దేవుడి పేరిట మొండిగా కొట్టుకొస్తున్న నన్ను సమన్వయ మార్గంలో పడవేసిందే మీరు! నిప్పుమాట అలా ఉంచి నాకున్న తుప్పును మాత్రం వదలగొడుతున్నారు మీరు" అన్నారు రమణమూర్తిగారు. తుప్పు అన్నారుగదా ఫరవాలేదు. వదలగొట్టడం తప్పు అంటున్నారేమోనని భయపడ్డాను నేను" అన్నారు విలాసంగా చూస్తూ మాస్టరుగారు.

కొద్దిక్షణాలు ఆ సరసానుభూతిలో నిశ్శబ్దంగా నడిచాయి.

కడుక్కున్న చేతులను తుడుచుకుంటూ ఇంతకూ రమణమూర్తిగారు, మీరొక కాయను, ఒక పండును విడిచి పెట్టారన్న మాట, బాగుంది. ఇంతకీ అంత దూరం వెళ్లి విడిచిపెట్టాల్సింది ఏమిటో తెలుసా? ***కాయన్ని, పండుని కాదు. మనకున్న కాయాభిమానాన్ని, ఫలాపేక్షను విడిచి పెట్టగలగాలి.***

రమణమూర్తిగారితో పాటు అందరూ ఆశ్చర్యంతో చూస్తున్నారు.

మాస్టరుగారు ఇంకా ఇలా అన్నారు "ఏం రమణమూర్తిగారూ! కాయమంటే ఏమిటి? ఈ శరీరమేనా? ఖాయమేగదా! ఆ... అది చేతనైతే ఈ కాయంమీద ఉండే అభిమానాన్ని మనం విశ్వేశ్వరుడి సన్నిధిలో విడిచిపెట్టగలగాలి. ఇంక పండు, పండు అంటే ఏమిటి? ఫలం. అంటే ఈ ఫలం కాదు. కర్మఫలం. కర్మల్ని ఆచరిస్తూ ఆ కర్మల వల్ల వచ్చే స్థితిని,అంటే ఫలాపేక్షను, ఆ శివుని సన్నిధిలో సన్యసించ గలగాలి. అంతేగాని ఒక కాయను, ఒక పండునూ వదిలిపెట్టామని చేతులు దులుపుకుంటే సరిపోదు. విడిచి పెట్టడం అనేది ఈ కాయ పండుతో మొదలుపెట్టి ఆ కాయాభిమానాన్ని, ఫలాపేక్షను విడిచి పెట్టడం దాకా కొనసాగాలని మన పెద్దల కోరిక.

అయినా ఆ కాయని, పండుని మాత్రం మనమెక్కడ వదిలిపెడుతున్నాం. అవి కనపడుతున్నపుడల్లా వీటిని కాశీలో వదిలిపెట్టాం. వీటిని కాశీలో వదిలిపెట్టామని గుర్తొస్తూనే ఉన్నది కదా! అంటే ఏమిటి? గుర్తు చేసుకుంటూ మనం మనస్సుతో తింటూనే ఉన్నాం. ఇక తిననిదల్లా పాపం మన నోరే. ఏమంటారు! ఇది "కాయా, పండు కథ" అన్నారు వెలుగుదనంతో చిలిపితనాన్ని మేళవిస్తూ.

"మొత్తం మీద వాయించేసారు సార్! ఈ మామిడిపండు పుణ్యమా అని కాశీకథలోని రహస్యాన్ని ప్రకాశం చేసారు మీరు. ఏమిటన్నారు! విడిచిపెట్టవలసింది కాయాభిమానాన్నీ, ఫలాపేక్షనునా" అని అంటూ, మళ్ళీ మళ్ళీ అనుకొంటూ ఇంకా ఇంకా పరవశించసాగారు రమణమూర్తిగారు.

ఆ పారవశ్యం కొనసాగుతూ ఉండగానే మాస్టరుగారి రచనా వ్యాసంగం తిరిగి కొనసాగడం

మొదలైంది. అలవాటుపడిన రమణమూర్తిగారి వ్రేళ్లు అప్రయత్నంగానే తమ పనిని మొదలుపెట్టేశాయి. మాస్టరుగారి వాక్కుకు ఆయన తైపు మిషను బదులు పలుకుతూ ఉంది. సన్నివేశం మళ్ళీ గాంభీర్యాన్ని సంతరించుకోసాగింది. **– సేకరణ : గురుకృప**




## అంతర్యామి ఆవాసం

సద్గురు స్వరూపం మానవుని ఊహలకు అందేది కాదు. భాషకు, భావానికి లొంగేది కాదు. ఏదో ఒక అవ్యక్తమైన అనుభూతి. అనుగ్రహం అందరిమీదా ఒకేరకంగా వర్షించినా – గొడుగుపట్టి అడ్డగించే మనసు కొందరిది, వర్షించే ప్రతి చినుకూ స్వాతి చినుకు (తొలకరి)లా ఆస్వాదించి, పరవశించేది మరికొందరు. ఈ అనుభవాలలో సామ్యాలను కాదు చూసింది గురుకృప. గురుతత్వంలో చూడాల్సింది గమ్యాలను, మనిషి గమనాలను. అంతర్యామిగా సద్గురువు భాసిస్తుంటే – ఆయన ఆవాసం మన హృదయ మందిరమైతే వినతులూ లేవు, అంగీకారాలూ లేవు. అందే ప్రతిదీ సద్గురు ప్రసాదమే. కనిపించే ప్రతిదీ సద్గురు లీలా వినోదమే. అవధరించి, ఆనందించండి...

***పశ్చిమాన ప్రభవించిన భక్తినాదం :***

1993 జనవరిలో నేను భారత దేశానికి రాబోయే కొద్ది ముందుగా అప్పుడే భారతదేశం నుండి వచ్చిన నా సోదరుడు నాకూ, మా శ్రీవారికి శిరిడి సాయిబాబా క్యాలెండరు ఒకటి చిన్నసైజుది తెచ్చి ఇచ్చాడు. నాకు ఆ ఫోటోలో ఉన్న సాయిబాబాను గూర్చి ఏమీ తెలియనప్పటికీ ఆ ఫొటో మాత్రం ఎందుకో నచ్చింది. భారతదేశంలో పేరుగాంచిన అనేక మంది మహనీయుల్లో వీరూ ఒకరేమో అనుకున్నాను. తదుపరి ఆ విషయం పూర్తిగా మర్చిపోయాను.

తర్వాత భారతదేశానికి రావటం జరిగింది. ఢిల్లీలో మొదటిరోజు సాయంత్రం లక్ష్మీనారాయణ మందిరం పార్కులో నడుస్తుండగా ఒక ఫొటోగ్రాఫర్ మమ్మల్ని ఫోటో తీసుకొమ్మని ఎంతగానో ఒత్తిడి చేసాడు. అతడి ఒత్తిడికి తలవొగ్గాం. అ్కడ ఫోటోకి వెనుక ఉండే బ్యాక్‌గ్రౌండ్స్ ఎవరికి నచ్చినవి వారు తీసుకునేందుకు వీలుగా చాలా ఉన్నాయి. నేనెందుకో ప్యాకెట్ క్యాలెండర్‌లో ఉన్న "వృద్ధుడ్ని" బ్యాక్‌గ్రౌండ్‌గా ఫోటో తీసుకోవాలనుకున్నాను. వెంటనే ఆ క్యాలెండర్‌లో అభయహస్తాన్ని ఇస్తూ ఉన్న మహనీయుని ఫొటో బ్యాక్‌గ్రౌండ్‌గా ఫోటో తీయించుకొని ఆనాటి నుండి ఆ ఫోటోను నా వద్ద ఉంచుకున్నాను.

కొన్ని వారాలు అలా ఉత్తర భారతంలో గడిపి నా హృదయానికి అత్యంత చేరువైన అరుణగిరి, భగవాన్ రమణుని సాన్నిధ్యం తిరువణ్ణామలై చేరాము, నేనంతకు మునుపు ఆ ప్రాంతం చాలాసార్లు దర్శించినదే. అరుణగిరి పాదాన్నంటే వరుణాశ్రమంలో ఉండే మా కాటేజీకి చేరగానే మా ప్రక్క కాటేజీలో వారు ఎవరై ఉంటారా? అనే సందేహం కల్గింది. కాటేజి బయట తాళం వేసి ఉంది. ఉత్సుకతను ఆపుకోలేక కిటికీలో నుంచి చూడాలి వారెవరో అనుకున్నాను. అన్ని కర్టెన్లు వేసి ఉన్నాయి. కిటికీలు మూసి ఉన్నాయి. అదృష్టం పొదమాటున వెనుకవైపు ఒక్క కిటికీ మాత్రం సగం తెరచి ఉంది. కిటికీ పైకెక్కి చూసాను. ఆశ్చర్యం మావద్దనున్న పెద్ద ఫొటో కన్పించింది. వింతగా తోచింది. ఈ అయాచిత దర్శనం.

రెండు వారాల తర్వాత మరలా మా ప్రక్క కాటేజీకి ఏదో జీవకళ వచ్చినట్లు అనిపించింది. ఈ కాటేజీలన్నింటికీ యజమాని, కణ్వాశ్రమం అధ్యక్షులు అయిన హంసగారు శిరిడి నుండి స్వామీజీ వచ్చి ప్రక్క కాటేజీలో ఉంటున్నట్లు తెల్పారు. హంసగారు ఆ సాయంత్రం మరికొందరితో వచ్చి స్వామీజీ దర్శనానికి ఆహ్వానించారు.




స్వామీజీని కల్సుకోవాలనే ఉత్సాహం ఒకవైపు, మరోవైపు ఈ స్వామీజీలకు పాద నమస్కారం చేయవలసి వస్తుందేమోనని శంక. కానీ స్వామీజీని చూస్తూనే నేను వెతుకుతున్న వ్యక్తినో, చిరపరిచితుణ్ణో చూచినట్లు అన్పించింది. దర్శనానికి వచ్చిన అందరూ వారి వారి సందేహాలు తీర్చుకుంటున్నారు. నేను మాత్రం "ముక్తి"ని గూర్చి ప్రశ్నించాను. స్వామీజీ మాటలే కాదు, వారి సాన్నిధ్యం నా హృదయంపై చెరగని ముద్రని వేసాయి. శెలవు తీసుకునేవేళ, నేను స్వామీజీ ప్రక్క కాటేజీలో నివసిస్తున్న వారిగా పరిచయం చేసుకొని, మరలారావచ్చా దర్శనానికి అని విచారించాను. ఆనాటి నుంచి రోజూ సాయంత్రం ఒక పదిరోజులపాటు సాయంవేళల్లో సత్సంగాలకు హాజరయ్యాం. ఎక్కువగా పాశ్చాత్యులు గుంపులుగా స్వామి వారితో ఆధ్యాత్మిక పరమైన చర్చలు చేయటం లేదా వారి సాన్నిధ్యంలో మౌనంగా ధ్యానం చేసుకునేవారు. అప్పుడప్పుడూ నేనూ నా భర్త మాత్రమే వారి సాన్నిధ్యంలో వుండటం జరుగుతుండేది. స్వామి వారి ఇరుగువారిగా ఉండే భాగ్యానికి మురిసిపోయాం. ఈ అవకాశం ద్వారా నేను పొందిన అనుభవాలు లెక్కలేనన్ని. ఆ మధురక్షణాలు, నా గుండె లోతుల్ని తాకాయి.

***చేర్చింది సాయిపథం...*** ఆరోజు గురువుగారితో జరిగిన సత్సంగం. దాని కారణంగా నాలో కల్గిన ధ్యాన పారవశ్యం నుండి ఇంకా తేరుకోక మునుపే నిద్రకుపక్రమించాను. ప్రక్కమీద మేను వాల్చానేగాని ఆనంద పారవశ్యం నా శరీరం అంతా నిండి నిద్రే రాలేదు. హఠాత్తుగా గురువుగారి ప్రత్యక్ష సాన్నిధ్యం అనుభవమయింది. మనం భౌతికంగా చూసే విధానంలో చూడలేదుకానీ, గురూజీ ప్రత్యక్ష సాన్నిధ్యంలో ఎలాంటి పారవశ్యమో అలాంటి పారవశ్యమే స్పష్టంగా అనుభవమయింది. అంతటి నిదర్శనా పూర్వక దర్శనాన్ని తట్టుకోలేక దుప్పటి కప్పుకున్నాను. నిద్రలేచిన దగ్గర నుండి ఒకటే ప్రశ్న? తలుపులన్ని తాళాలు వేసి ఉండగా ఎలా గురూజీ నా గదిలోనికి రాగలారాఅని, సమాధానంగా కూడా స్ఫురిస్తూనే ఉంది. ఇది భౌతికంగా ఇచ్చిన దర్శనం మాత్రమే కాదు అని. మరురోజు సాయంత్రం సత్సంగమిత్రులు గురూజీని మా కాటేజీకి రమ్మని ఆహ్వానించమన్నారు. గురూజీని వేడుకొన్నాం. మా కాటేజీకి వచ్చి అనుగ్రహించమని. **"నేను అంతకు మునుపు రాలేదా? రాలేదంటే చెప్పండి. వస్తాను"** అంటూ చిరునవ్వులు కురిపిస్తూ అన్నారు. నాకు రాత్రి లభించిన దర్శనం తమ అనుగ్రహమేనని ఇంత స్పష్టంగా, అధికారపూర్వకంగా తెల్పుతుంటే నా అదృష్టానికి పొంగిపోయాను.

సత్సంగాలలో మొదటి రోజుల్లో గురూజీ అన్నారు. "నీ వెనుక బాబా ఉన్నారు" అని కొద్ది రోజుల తర్వాత ఒక పౌర్ణమినాడు గురూజీతో "గిరి ప్రదక్షిణం" వెళ్ళే అదృష్టం కల్గింది. దారిలో నా వద్ద ఉన్న సాయిబాబా బ్యాక్‌గ్రౌండ్‌గా తీయించుకున్న ఫొటో చూపించాను. ఆయన ఎంతో సంతోషంగా 'నేను చెప్పానుగా నీ వెనుక బాబా ఉన్నారని". ఈ విషయం ధృవపరచమని బాబాను అడిగాను. ఇదిగో ఇప్పుడు లభించింది" అన్నారు.




ఇలా నా గురువును నేను చేరుకోగల్గాను. సాయినాథుడు నా గురువుగ్వారా తన పాదాల వద్దకు చేర్చుకొన్నారు నన్ను. ప్రపంచంలో నా అంత అదృష్టవంతురాలు లేదనే అన్పిస్తున్నది. కొద్దిరోజుల తర్వాత నేను, నా భర్త మా దేశానికి తిరిగి వెళుతూ శిరిడీ సందర్శించాం. ఆ దర్శనం మా హృదయాలపై వేసిన ముద్రలు ఎన్నటికీ చెరగనివి. మరలా మూడు నెలల తర్వాత గురువు పాదాల చెంతవాలి, వారి బోధనామృతపానంలో ప్రత్యక్ష సాన్నిధ్యంలో, ఆనంద పారవశ్యంలో. ఇవి స్పెయిన్‌కు చెందిన గురుబంధువు ఇవాన్‌వీర్‌గారి అనుభూతులు. మరో గురుసాన్నిధ్యంలో జరిగిన అనుభవాన్ని అవధరిద్దాం....

చేబ్రోలు గ్రామమున పట్టాభిరాముని ప్రతిష్ఠకై వచ్చిరి. ప్రతిష్ఠాపనోత్సవము ముగిసిన పిదప భోజనానంతరం మాస్టరుగారు ఆలయమునకు సమీపమున గల ఒక భవంతిలో విశ్రాంతిగైకొనుచుండిరి. ఆ సమయమున నా శ్రీమతి మాస్టరుగారిని సమీపించి మా ఇంట వారి పాదము బెట్టుడని ప్రార్థించినది. మాస్టరుగారు చిరునవ్వుతో "మీ ఆయన నన్ను పిలిచిన గదా నేను వచ్చునది, మరి పిలువలేదాయె" అని పలికిరి. నా శ్రీమతి నా వద్దకు వచ్చి, తనకు మాస్టరుగారికి నడుమ జరిగిన సంభాషణ తెలిపి, మాస్టరుగార్ని మన ఇంటికి ఆహ్వానింపుడని నన్ను కోరినది. మాస్టరుగారి చమత్కారమునకు ఆశ్చర్యపడి, వారిని పిలువపనియేమి, రాదలచినచో వారే వచ్చెదరని నేను నా శ్రీమతికి బదులు పలికితిని. ఏమయినను ఆమె ఒత్తిడిపై మాస్టరుగారిని సమీపించి, నేను పిలువకపోవుట వలన, మీరు మా ఇంటికి వచ్చుటలేదని అన్నారట" అని అడిగితిని. శ్రీవారు "అవును నిజమే, నీవు నన్ను పిలువలేదు కదా, నీవు పిలువకుండా, నీ ఇంటికి ఎట్లు వచ్చెదను?" నేను "మా ఇల్లని ప్రత్యేకముగా కలదా? మేమే మీవారమై వుండగా, మా ఇల్లని వేరుగా ఉండునా? ఇది తమ ఇల్లేగదా! మీ ఇంటికి మీరు వచ్చుటకు మధ్యలో మేమెవరమాహ్వానించుటకు! అదియును గాక ఇప్పుడు తమరిని ఇంటికి రమ్మని ఆహ్వానించుటయున్నచో ఇంతకు పూర్వమును, ఇటుపైనను ఈ ఇంటిలో తమ ఉనికి లేదని అంగీకరించుటయగును. అట్లంగీకరించుట నాకు సమ్మతము కాదు. మీ ఉనికి లేని క్షణమును నేనూహింపలేను.

***ఇంటిలోనే కాదు, వంటిలో కూడా...***

ఇక భౌతికముగా మీ రాక గురించియా! నాకు మీరొక్కరే గురువులు. కాని మీ కెందరో కావలసిన వారున్నారు. అనేక కార్యములలో మునిగియుండు తమకు తీరిక దుర్లభము. మీరు కావలయునని ఎప్పుడు సంకల్పించినచో అప్పుడే వచ్చెదరుగాని, నేను మిమ్ములను నా ఒక్కని కోసమై బలవంత పెట్టుట న్యాయము కాదు కదా! శ్రీవారు నవ్వి ఊరకుండిరి.

ఇక నేను గుడిలో కార్యక్రమ వ్యవహారములు పరిశీలించి, నాలుగున్నర గంటల వేళకు ఇంటికి చేరగా, అప్పటికే మాస్టరుగారు మా ఇంటిలోని పడక కుర్చీలో బరుండియున్నారు. నా భార్య ఎంతయో పొంగిపోయినది.

– సేకరణ : *గురుకృప*

# సుపుత్ర ప్రాప్తిరస్తు




"సుశీల గురువుగారి ఆశీస్సుల కోసం పాపాయిని తీసుకుని ఆసుపత్రి నుంచి నేరుగా ఇక్కడికి వచ్చింది" పొత్తిళ్లలో పాపను పట్టుకుని సుశీల, ఆమెకు అటు తల్లి, ఇటు తండ్రి – వారి వెనుకనే సుశీల భర్త సోమశేఖరం–వారి మొహాలు ఆనందంతో వెలిగిపోతున్నాయి. మ్యాచ్ ఫిక్సింగుల్లేని ఆటలో వరల్డ్‌కప్ గెలుచుకున్న క్రికెట్ టీములా అత్యుత్సాహంతో ముందుకు దూసుకు వచ్చేసారు వాళ్లు.

పాపాయితో సహా గురువుగారి పాదాల మీద వాలిపోయింది సుశీల. గురువుగారు ధ్యానముద్రలో కళ్ళు మూసుకున్నారు. సుశీల పైకి లేచి పాపాయిని తల్లికి అందిస్తూ, "మీ దయవల్ల…" అని ఏదో చెప్పబోయింది. "నా దయేంలేదు అంతా మీ స్వయంకృతమే!" అన్నారు గురువుగారు అదోలా కళ్ళతో నవ్వుతూ. సిగ్గుతో బిక్కచచ్చిపోయి నోటిమాట రాక గురువుగారి మొహంలోకి చూస్తుండిపోయారందరూ. మరుక్షణంలోనే "పాపం! ఆడపిల్లటగదా!" అంటూ ముక్కి బలవంతంగా నవ్వులాంటిది ఒకటి ముఖం మీదికి తెచ్చిపెట్టుకుంటున్నారు గురువుగారు.

"మొదటి కాన్పు ఆడపిల్లే కావాలని మనసారా అందరం కోరుకున్నాం గురువుగారూ! మీ అనుగ్రహం వల్ల మా కోరిక తీరింది" ఎలాగో పెగుల్చుకుని మనసులోని మాట బయటపెట్టింది తల్లి.

"అవును, అదే తెలివైన పని! మగపిల్లవాడైతే మనకేమిటి లాభం?" గురువుగారి ముఖం సీరియస్‌గా మారిపోయింది.

నడివేసవిలో మార్గమధ్యంలో వడగాల్పులు వీస్తున్నట్లుగా తల్లడిల్లిపోతున్నారందరూ. "స్వామీ! మా పాపాయిని తమరు ఆశీర్వదించాలి. మంచయినా, చెడయినా అన్నింటికీ మీరే మాకు దిక్కు". పాదాలమీద పడి వేడుకున్నాడు సోమశేఖరం.

లేవదీసి వీపు నిమురుతూ అన్నారు గురువుగారు– "మీ పాపాయికేమోయ్, మీ ఆవిడకంటే తెలివైనదీ, అదృష్టవంతురాలూను– దానిగురించి నువ్వేం వర్రీ అవ్వకు. మీ ఆవిడ ఉండగా నీకెందుకోయ్ బెంగ? తనకంటే బాగా చదివిస్తుంది. తన మొగుడు కంటే బాగా సంపాదించగల వాజమ్మనొకడిని చూసి చక్కగా పెళ్లి చేస్తుంది. మీ అత్తామామల్లా మీరు కూడా అప్పటికి రిటైర్ అయిపోయి కూతురు దగ్గర సెటిలయిపోవచ్చు. దీనికంటే ముందుపుట్టి ఎక్కడో పెరుగుతున్నాడే, దీనికొక్కాబోయేవాడు, వాడి తల్లిదండ్రుల గురించే నా బాధంతాను!" గతుక్కుమంది సుశీల. అయోమయంగా చూశాడు సోమశేఖరం. సిగ్గుతో తలలు వంచుకుని కుచించుకుపోయారు సుశీల తల్లిదండ్రులు.

"మా అత్తగారిని, మామగారినీ మాతో ఉండమని ఎంతగా బ్రతిమలాడినా ఆ పల్లెటూరి నుంచి వచ్చి ఈ పట్నంలో ఉండలేమన్నారు స్వామీజీ – కావాలంటే ఆయన్ని అడగండి. పాపం ఆయన కూడా ఎంతగా చెప్పి చూసారో! కదండీ?" అంటూ భర్త మొహంలోకి చూసింది సుశీల.

"మా వాళ్లకి మొదట్నుంచీ మా ఊళ్లోనే బాగా అలవాటండీ – ఒకటిరెండుసార్లు బలవంతంగా తీసుకువచ్చి మాతో ఉండిపొమ్మని బ్రతిమలాడినా వెళ్లిపోతామని మూర్ఖంగా పట్టుబట్టి వెళ్లిపోయారు" అన్నాడు సోమశేఖరం.

వెనుకటికి తెనాలి రామలింగడని ఒక కవి ఏంచేసాడో తెలుసా? రాయలవారు తలొకపిల్లిని, కొంతసొమ్ముని ఆస్థాన పండితులందరికీ ఇచ్చి, పాలుపోసి బాగా పెంచండని చెప్పాడు. రామలింగడు ఆ సొమ్ము తాను మ్రింగేసి పిల్లికి పాలు పొయ్యకుండా ఎండగట్టాడు. రాయలవారు 'అదేమిటి నీ పిల్లి ఇలా తయారయ్యిందని' అడిగితే, 'ఏం చేయమంటారు ప్రభూ! నాకు మీరిచ్చిన పిల్లికి పాలు సరిపడవు, పాలు కంటపడితే చాలు పారిపోతుంది దూరంగా…." అన్నాడు. రాయలు ఆశ్చర్యపోయి, పాలు తెప్పించి, దాని ముందుంచితే అది మూతి తడుముకుంటూ

దూరంగా పారిపోయింది. దానికేమయ్యిందోనని వాకబు చేస్తే, రామలింగడు మొదటిరోజే వేడి వేడి పాలతో దాని మూతి కాలేలా చేసి, దానికి పాలంటే భయం కలిగేలా చేసాడని తెలిసింది రాయలవారికి. అప్పట్నుంచీ తెనాలి రామలింగడి పిల్లని ఒక జాతీయం ఏర్పడిపోయింది తెలుగులో. వీళ్లకంటే మానాభిమానాలు లేవు గనుక కోడలితో గొడవలు పడి, కొడుకుని కాదనుకుని, కూతురింట్లో తిష్టవేసారుగానీ, మీ తల్లిదండ్రులు కాస్త సంస్కారం ఉన్నవాళ్లు గదా, కోడలితో మాటలు పడటం, అవన్నీ నీకు చెప్పి నీ మనస్సు పాడుచేయడం ఇష్టంలేక వాళ్ల మానాన వాళ్లు దూరంగా బ్రతుకుతున్నారు. నీ సొమ్మేదో వాళ్లు అప్పనంగా దోచుకుతింటున్నారని అనుకుంటారేగాని, నిన్ను చదివించి ఇంతటివాణ్ణి చెయ్యడానికి వాళ్లు ఎన్ని పాట్లు పడ్డారో మీ ఆవిడకు తెలియదు గదా! నీకు మీ వాళ్లమీద ప్రేమ అయితే ఉన్నదిగాని మనుషుల్లో మాయ ఉంటుందని తెలియదాయె! వాళ్లు మూర్ఖత్వంతో రావడం లేదనే అనుకొంటావు. వాళ్ల బాధేమిటో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే గదా నీకు అసలు విషయం బోధపడేది?"




నిర్ఘాంతపోయాడు సోమశేఖరం.

గురువుగారి పాదాలమీదపడి భోరుమంది సుశీల. తేలుకుట్టిన దొంగల్లా కిక్కురుమనలేదు వృద్ధ దంపతులు.

"గురువంటే నువ్వు ఏం చేసినా ఆమోదించి, నీవు కోరుకున్న ప్రకారమే నీకు అన్నీ జరిగేలా ఆశీర్వదించే వెర్రి వెంగళయ్య అనుకోకు – మీరందరూ వచ్చి సంస్కారవంతమైన మంచి కుటుంబంలో పుట్టిన చక్కని వరుడు కావాలని అడిగితేనే గదా నేను మీకీ సంబంధం కుదిర్చాను! మీకుందా సంస్కారం? అని ఆనాడే మిమ్మల్ని నేను అడిగి ఉండాల్సింది. పెళ్ళికి ముందు వాళ్ళు ఏమన్నారో మర్చిపోయినట్టున్నారు మీరు – 'మాకు కట్నాలు కానుకలు కాదు ప్రధానం. మా కోడలు మా ఇంట్లో పిల్లలా మాతో కలిసిపోయేదయితే చాలు. మాకున్నది ఒక్కడే కొడుకు – మా ప్రాణాలన్నీ వాడిమీదే – గురువుగారి మాట మాకు వేదవాక్కు – అందుకని ఒప్పుకుంటున్నాం' అనలేదూ? మీరేమో మహద్భాగ్యం! ఇలాంటి సంబంధం దొరకటం మా అదృష్టమని మురిసిపోయారు – మహద్భాగ్యమే మీకు – ఎందుకుకాదూ? మీ కోడలి వియ్యాలవారి లాంటివాళ్లు వీళ్లు కూడా అయ్యుంటే తెలిసుండేది అదృష్టం ఏమిటో – 'గురువుగారూ!' అంటూ పాదాలు పట్టేసుకుని వెర్రివేషాలు వేస్తే చూస్తూ ఊరుకుంటాననుకోకండి – రెండో కాన్పు చూస్తావు గదా– పండంటి మగపిల్లవాడు పుడతాడులే ఈసారి – వాడిని నువ్వు కళ్లల్లో పెట్టుకుని పెంచు, వాడు పెద్దవాడయి, పెళ్లి చేసుకున్నాక, నీవంటి అతి తెలివైనదే నీకు కోడలవుతుంది. అప్పుడు తెలిసొస్తుంది. నీ అత్తమామలు నీవల్ల బయటికి చెప్పుకోడానికి కూడా లేకుండా ఎంతటి హింసపడ్డారో! 'సుపుత్ర ప్రాప్తిరస్తు!' ఆశీర్వదిస్తున్నాను, ఇకపో, అన్నారు గురువుగారు సుశీల మొహంలోకి తీక్షణంగా చూస్తూ.

భయంతో నిలువెల్లా వణికిపోయింది సుశీల. "క్షమించండి గురువుగారూ! మరెప్పుడూ ఇలాంటి బుద్ధితక్కువ పని జీవితంలో చెయ్యను. చంటిదానిమీద ప్రమాణం చేసి చెబుతున్నాను. మా అత్తమామల్ని నా ప్రాణంలా చూసుకుంటాను. బారసాల అయిపోగానే మా అమ్మానాన్న అన్నయ్య దగ్గరికి బెంగుళూరు వెళ్లిపోతారు. మా వాళ్లు మా దగ్గరే ఉండిపోతారు" అంది సుశీల.

"కష్టమో నిష్ఠూరమో మా పెన్షన్ కొడుకు చేతిలో పెట్టి మా కోడలు దగ్గరే మేం పడుంటాం గురువుగారూ! మా కళ్ళు తెరిపించారు–ధన్యవాదాలు మీకు" అన్నారు వృద్ధ దంపతులు.

**"మరి పాపాయికి పేరో" అన్నాడు సోమశేఖరం.**

**"జాగృతి" అన్నారు గురువుగారు,** పాప తల స్పృశిస్తూ. అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

*(డాక్టర్ వాడపల్లి చక్రపాణిరావు, నావాణి)*

## మన బాబా స్మరణకు దోహదం చేసేటటువంటి ఒకానొక సాధనం సత్సంగం

మనమందరం కూడాను బాబా దగ్గిర ఉద్ధరింపబడడానికే వచ్చాం. మనకు బాబా యొక్క గుర్తింపుని, బాబా యొక్క స్మరణని తప్పిస్తున్నాయి కనుక, రకరకాల మనకుండేటటువంటి సంఘం... మనం ఒక Environment యొక్క Influence లో ఉన్నాం కనుక, మనం మన యొక్క Environmentని మనమే సృష్టించుకోవాలి. పంటకి వేసేటటువంటి కంచెలాగా. అటువంటి వాతావరణాన్ని సృష్టించుకొని మన స్మరణని చిన్న దీపంలా, గుడ్డి దీపంలాగ ఉంది ఇది. ఈ గుడ్డి దీపం ఉఫ్ఫ్ అని ఆరిపోకుండా ఒక గ్లాస్ లాగా అడ్డుకునేటువంటి అడ్డుకోవడమే సత్సంగం అంటే. అది మన కోసం మనం చేసుకునేటువంటిది. లేకపోతే ఈ ప్రపంచం అనేటువంటి గాలిలో కొట్టుకుపోతుంది, ఆరిపోతుంది... ఇది పెద్ద మంటైనప్పుడు  అది వేరే విషయం. ఊర్లనే కాల్చేస్తుందిక. దాన్ని ఆపేదేముండదు. గాలికొడితే ఇంకా ఎక్కువవుతుంది. కాని ఇప్పుడు మనది అంతలేదు. ఇంతే ఉంది. చిన్న గుడ్డి దీపంలాగా ఉంది. దీనిని నిలబెట్టుకునేటువంటి ప్రయత్నం.

కాబట్టి రకరకాలుగా మనకుండేటువంటి పరిచయాలుగాని, మనకుండేటువంటి రొటీన్‌లోగాని ఈ బాబా అనేటటువంటి ఈ వాతావరణాన్ని సృష్టించుకొని మనకుండేటువంటి ఫ్రెండ్స్‌గాని, మనకుండే పరిచయస్తులుగాని, మనమెక్కడికి పోయినా సరే మన బాబాని గుర్తు చేసేలా, లేకపోతే మర్చిపోతాం గనక నేను. ఎదుటోడికి గుర్తు చేయడానికి కాదు, మనకు మనం గుర్తు పెట్టుకునేటువంటి ప్రయత్నమే సత్సంగం.



బాబా అనేటువంటి ఒక అద్భుతం మనకొచ్చింది. మనకెన్నో కష్టాల్లోనించి ఒక తరుణోపాయం బాబా రూపంలో మనకు దొరికింది. ఈ తరుణోపాయాన్ని ఈ అద్భుతాన్ని మన సాటివారితో పంచుకునేటువంటి ప్రయత్నమే సత్సంగం అంటే. నేను చేస్తున్నా ఇప్పుడు అదే. బాబా పట్ల నాకుండేటువంటి ప్రేమని మీతో పంచుకుంటున్నా అంతే. మనకు, మన బాబా స్మరణకు దోహదం చేసేటువంటి ఒకానొక సాధనం సత్సంగం.

- శ్రీబాబూజీ


గురుని కంటిని - గురుని వింటిని..
పరమగురునితో ఉంటిని..
మాయ మర్మము లేనివాడు
మాయ 'మర్మము' తెలిపెనతడు
మాయ దారి పట్టనీయక
మాయ దాటే మార్గమిచ్చిన
గురుని కంటిని గురుని వింటిని..
పరమగురునితో ఉంటిని..
మతము పిచ్చి లేనే లేదు
కులము పిచ్చి కానరాదు
ధనము పిచ్చి అసలు లేదు
మానవత్వమే ముఖ్యమైన
గురుని కంటిని - గురుని వింటిని..
పరమగురునితో ఉంటిని..
ఇప్పుడున్నది దివ్యత్వ (దేదీప్య) రూపం